జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 4 సంచిక 185 | హైదరాబాద్, ఏప్రిల్ 24 శనివారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

మాస్టర్ కీ TV (అంబేడ్కర్ TV) ఛానల్

కావలెను

Senior Anchor

Graphic Designer

Sub-Editor

Marketing Manager

అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

ఆసక్తిగలవారు

ఈ క్రింది నెంబర్లల్లో సంప్రదించగలరు

8886656884, 9948725373

# జాతీయ ప్రణాళిక రూపొందించండి



**కేంద్రాన్ని ఆదేశించించిన సుప్రీం**

**దేశం అయోమయ పరిస్థితుల్లో ఉంది**

**అమికస్ క్యూరీగా తప్పుకున్న హరీశ్ సాల్వే**

**సుప్రీం విచారణ ఏప్రిల్ 27కు వాయిదా**

దిల్లీ,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి: దేశంలో కొవిడ్ ఉద్ధృతిపై సుప్రీంకోర్టు సుమోటోగా చేపడుతున్న విచారణ నుంచి ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే అమికస్ క్యూరీగా తప్పుకొన్నారు. దేశం ప్రస్తుతం అత్యంత అయోమయ స్థితిలో ఉందన్న సాల్వే.. న్యాయస్థానం విచారిస్తున్న త్యంత క్లిష్టమైన విచారణ ఇదేనని అభిప్రాయపడ్డారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే తనకు ఎప్పటినుంచో తెలిసి ఉన్నందున ఈ విచారణ నుంచి తాను తప్పుకొంటున్నట్లు తెలిపారు.

దేశంలో కరోనా కేసులు నానాటికీ పెరుగుతుండటంతో వైరస్ నియంత్రణ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ ఎస్ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. (మిగతా 2లో...)



# కర్ఫ్యూ విధిస్తే సరిపోతుందా..?

**తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**

హైదరాబాద్,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణలో కరోనా పరిస్థితులపై హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా కరోనా పరీక్షలు, చికిత్సలు, నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన నివేదికపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నెల 1 నుంచి 21 వరకు 19.64 లక్షల కొవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు రాష్ట్ర ప్రభుత్వం నివేదికలో పేర్కొంది. 16.17 లక్షల ర్యాపిడ్ పరీక్షలు, 3.47 లక్షల ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేసినట్లు తెలిపింది. అయితే ఆర్టీపీసీఆర్ పరీక్షల సంఖ్య ఎప్పుడు పెంచుతారని విచారణ సందర్భంగా హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది."రెండో దశ పొంచి ఉందన్న విషయం తెలిసినా ఎందుకు సిద్ధం కాలేదు. కరోనా రెండో దశ వ్యాప్తి చెందాక మేల్కొంటారా? రాత్రి కర్ఫ్యూ అమలు చేస్తున్నారని చెబుతున్నారు.. రాత్రి కర్ఫ్యూ అమలు చేస్తే సరిపోతుందా? సినిమా థియేటర్లు, మద్యం దుకాణాలు, పబ్‌లపై ఆంక్షలేవి?ఎన్నికల ర్యాలీలపై ఎందుకు ఆంక్షలు విధించడం లేదు?పెళ్లిళ్లు, అంత్యక్రియలకు ఆంక్షలున్నప్పుడు.. మరి ఎన్నికలు అతీతమా?రాష్ట్రంలో కరోనా మరణాలపై ప్రభుత్వానివి కాకిలెక్కలని ఆరోపణలున్నాయి" అని విచారణ సందర్భంగా హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

## తెలంగాణలో ఒకే రోజులో 2 లక్షలకు పైగా వ్యాక్సినేషన్లు



హైదరాబాద్,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి: జనవరి 16న కొవిడ్ -19 వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభమైన తర్వాత మొదటిసారిగా తెలంగాణలో ఒకే రోజులో రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మందికి వ్యాక్సిన్లు ఇవ్వడం రికార్డుగా అధికారులు పేర్కొన్నారు. గురువారం నాడు మొత్తం 2,11,244 మందికి కొవిడ్-19 వ్యాక్సిన్లు ఇవ్వగా అందులో 24,787 మందికి సెకండ్ డోస్ లభించగా, మిగిలిన 1,86,457 మందికి మొదటి డోస్ లభించింది. తెలంగాణలో ఇప్పటివరకు మొత్తం 31,59,780 మందికి కొవిడ్ -19 వ్యాక్సిన్ మొదటి డోస్ లభించగా అందులో 2,38,182 మంది ఆరోగ్య కార్యకర్తలు, 2,21,275 మంది ఫ్రంట్‌లైన్ కార్మికులు, 27,00,323 మంది 45 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. వ్యాక్సినేషన్ బులెటెన్ ప్రకారం 4,42,954 మంది వ్యక్తులు తమ మొదటి, రెండవ డోస్ వ్యాక్సిన్లను పొందారు. ఈ-విన్ పోర్టల్ ప్రకారం.. ఇప్పటివరకు తెలంగాణ 37,24,350 కొవిడ్ వ్యాక్సిన్ డోస్‌లను పొందింది. 62,970 డోసులు ఆర్మీ సిబ్బందికి, 19,920 డోసులను కొవిడ్ టీకా కేంద్రాలలో(సీవీసీ) అధునాతన షెడ్యూలింగ్ కోసం బఫర్‌గా పొందారు.

# ఇదొక వింత రోగం.. నిర్లక్ష్యం వద్దు:ఈటల



కరీంనగర్,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా వైరస్ అనేది ఓ వింత రోగం అని.. దీని పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ సూచించారు. కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు.గాలిలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఇదొక వింత రోగం. ఏం లక్షణాలున్నా వైద్యులని కలవాలి. ర్యాపిడ్ టెస్టులు, ఆర్టీపీసీఆర్ టెస్టుల ఫలితం వచ్చే వరకు ఆలస్యమైతే.. లక్షణాలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించి తక్షణమే ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. నిర్లక్ష్యం కారణంగానే ప్రాణాలు పోతున్నాయి. వైరస్ సోకిన కొందరిలో ఎలాంటి లక్షణాలు కనిపించడం లేదు. అయినప్పటికీ ఆ వైరస్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపి, క్షణాల్లో ప్రాణాలను తీస్తుందన్నారు. పాజిటివ్ అని తెలిస్తే.. నిర్లక్ష్యం చేస్తున్నవారే మరణిస్తున్నారు అని ఈటల పేర్కొన్నారు.కరీంనగర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ట్యాంకు సామర్థ్యం 20 కేఎల్ అని తెలిపారు. ఈ ఆక్సిజన్ ఏడు రోజుల వరకు వస్తుందన్నారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు పెంచాలనే ఉద్దేశంతో.. ఇక్కడ ఆ మిషన్‌ను ఏర్పాటు చేశాం. దాంట్లో 400 టెస్టులు చేసే ఆస్కారం ఉంటుంది. ఆటోమేటిక్ మిషన్ అందుబాటులోకి వస్తే రోజుకు 1000 టెస్టులు చేసుకోవచ్చు. ప్రయివేటు ల్యాబ్‌ల మీద ఆధారపడకుండా ఈ సౌకర్యం కల్పించామన్నారు.

(మిగతా 2లో...)

## దేశంలోనే తొలిసారి..

# తెలంగాణకు యుద్ధ విమానాల్లో ఆక్సిజన్



హైదరాబాద్,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి: దేశంలోనే తొలిసారిగా ఆక్సిజన్ సరఫరా కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ విమానాలను ఉపయోగిస్తోంది. ఆక్సిజన్ ట్యాంకర్లతో కూడిన యుద్ధ విమానాలు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు ఈ ఉదయం బయల్దేరి వెళ్లాయి. 8 ట్యాంకుల ద్వారా 14.5 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు యుద్ధ విమానాలు తీసుకురానున్నాయి.

మంత్రి కేటీఆర్ అభినందనలు

ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించిన వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అభినందించారు. సత్వరమే ఆక్సిజన్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా యుద్ధ విమానాలను ఉపయోగిస్తోంది. మూడు రోజుల సమయంతో పాటు, ఎంతో మంది విలువైన ప్రాణాలను కాపాడేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. మూడు,నాలుగు రోజులుగా రాష్ట్రంలో 260 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను వినియోగిస్తున్నారు. అయినా సరిపోవడంలేదు. రాష్ట్ర ప్రభుత్వ విజప్తిమేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 360 మెట్రిక్‌టన్నుల ఆక్సిజన్‌ను కేటాయించింది. కేంద్రం కేటాయిస్తామని చెప్పిన దాంట్లో 70 టన్నుల వరకు మన రాష్ట్రంలో ఇప్పటికే (మిగతా 2లో...)

# రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల సేవలు వినియోగించుకోవాలి: గవర్నర్



హైదరాబాద్,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ నివారణ పద్ధతులపై, వ్యాక్సినేషన్ పై మరింత అవగాహన పెంచడానికి జాతీయ సేవా పథకం, జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్ల సేవలు వినియోగించుకోవాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ వైస్ ఛాన్సలర్ లకు సూచించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ లు, ఉన్నత విద్యాశాఖ అధికారులతో శుక్రవారం గవర్నర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో కోవిడ్ ఉధృతమవుతున్న సందర్భంలో, ప్రజలలో మంచి అవగాహన, చైతన్యం కలిగించడం అత్యంత ఆవశ్యకమని గవర్నర్ తెలిపారు. ప్రజలు సరైన విధంగా మాస్కులు ధరించడం, సోషల్ డిస్టెంసింగ్ పాటించడం, గుంపులుగా గుమికూడకుండా ఉండటం ఇలాంటివి కోవిడ్ నివారణ, నియంత్రణలో అత్యంత కీలకమని డాక్టర్ తమిళి సై స్పష్టం చేశారు. ప్రజా చైతన్యంతోనే కోవిడ్ లాంటి మహమ్మారిని నిరోధించగలమని, ప్రజల ప్రాణాలను కాపాడగలమని ఆమె అన్నారు. ప్రతి విశ్వవిద్యాలయంలోని ఎన్ ఎస్ ఎస్ కార్యకర్తలు, జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల సేవలను ఈ దిశగా తగు జాగ్రత్తలతో వినియోగించుకోవాలని గవర్నర్ సూచించారు.మనము ఎన్ని వెంటిలేటర్లు తయారుచేసిన, ఎన్ని మంచి మందులు తయారుచేసిన, ఆక్సిజన్ సరఫరా పెంచినప్పటికీ చైతన్యవంతమైన ప్రజలే సరైన ముందు జాగ్రత్తలతో కోవిడ్ నివారించగలరని డాక్టర్ తమిళిసై వివరించారు. కోవిడ్ బారిన పడుతున్న వారిలో దాదాపు 40 శాతం మంది యువకులే ఉండడం బాధను కలిగిస్తుందని గవర్నర్ ఆవేదన వ్యక్తం చేశారు.వైస్ ఛాన్సలర్ లు తమ తమ యూనివర్సిటీలలోని విద్యార్థులతో, వాలంటీర్లతో సోషల్ మీడియా ద్వారా ఇతర పద్ధతుల ద్వారా మంచి చైతన్యం కలిగించడానికి ప్రయత్నించాలని, వినూత్న పద్ధతులు అవలంబించేలా ప్రోత్సహించాలని గవర్నర్ సూచించారు. ప్రతి విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ వ్యాక్సిన్ తీసుకోవాలని , ఈ దిశగా అధికారులు అందరూ శ్రద్ధ చూపాలని ఆదేశించారు.వచ్చే నెల ఒకటవ తారీఖు నుండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి వ్యాక్సిన్ ఇవ్వనున్న దృష్ట్యా అర్హులైన అందరు విద్యార్థులు వ్యాక్సిన్ తీసుకునేలా ప్రోత్సహించాలి అని డాక్టర్ తమిళిసై స్పష్టం చేశారు.ఈ సందర్భంగా గవర్నర్ విశ్వవిద్యాలయాలలో ఆన్ లైన్ క్లాసులు, ఆన్ లైన్ పరీక్షలు జరుగుతున్న తీరుపై సమీక్షించారు. (మిగతా 2లో...)

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్

BUSSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?

మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

# గత ఎన్నికల ఫలితాలే పునరావృతమయ్యేనా ?

## కొన్నిచోట్ల అధికారపార్టీ వర్సెస్ స్వతంత్ర అభ్యర్థులు

## ఎవరు గెలిచినా తిరిగి తమగూటికే వస్తారన్న ధీమాలో అధికార పార్టీ

సిద్దిపేట(ప్రజాపాలన ప్రతినిధి) :గత ఎన్నికలకు పరంపరగానో లేక కరోనా వల్ల ప్రజలలో ఏర్పడిన భయమోగాని ఈసారి మున్సిపల్ ఎన్నికలు కూడా గత ఎన్నికల మాదిరిగానే చప్పగా సాగే అవకాశం ఉందని జనం గుసగుసలాడుకుంటున్నారు.ఒక్క అధికారపార్టీలో టికెట్ దొరకనివారి అసంతృప్తి తప్ప, ఈసారి ఎన్నికలు అంత గొప్పగా ఉండే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. అధికారపార్టీలో గత ఎన్నికలలో టికెట్ రాక స్వతంత్రంగా పోటీచేసి గెలిచిన వారు తిరిగి అధికారపార్టీలోకే వెళ్లారు. ఈసారి కూడా అదేవిధంగా అధికారపార్టీకి చెందిన కొందరు టికెట్ రాలేదని కారాలు మిరియాలు నూరి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్నారు.ఇది తెలిసి కూడా అధికారపార్టీ నాయకత్వం కిమ్మనకుండా ఉ ఒడడానికి కారణం, ఒకవేళ వాళ్ళ గెలిచినా తిరిగి మన పార్టీ లోకే వస్తారన్న ధీమా.ఈ లెక్కన చూస్తే అధికారపార్టీ నాయకత్వం ప్రతిపక్ష పార్టీలను అసలు తమకు పోటీలోనే లేరు అని ఎంత చులకనగా చూస్తుందో అర్ధమవుతుంది. నిజానికి ప్రతిపక్షాల పరిస్థితి కూడా అలాగే ఉంది,పోటీ ఇస్తుందని భావించిన బీజేపీ ఇప్పటి వరకు ప్రచారంలో మరీ వెనకబడడం,ఆ పార్టీ నాయకుడు కూడా ఒక వార్డ్ లో పోటీ చేస్తుండడంతో అన్ని చోట్లా ప్రచారానికి కార్యకర్తలు ఉన్నా నాయకులు లేని పరిస్థితి. ఇక కాంగ్రెస్ ది ఐతే మరింత దారుణమైన పరిస్థితి మొత్తం 43 వార్డ్ లకుగాను అభ్యర్థులు దొరకకో లేక మరేదైనా కారణమో కొన్నిచోట్ల



పోటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు లేకపోవడం ఆ పార్టీ దీనస్థితి ని తెలియజేస్తుంది.స్థూలంగా చూస్తే చాలా చోట్ల అధికారపార్టీ వర్సెస్ స్వతంత్ర అభ్యర్థులు అన్న పరిస్థితే కనబడడం గమనార్హం. రానున్న రోజుల్లో బీజేపీ పుంజుకుంటుందో లేక షరా మాములే అన్నట్లు, ఐతే అధికారపార్టీ అభ్యర్థులు లేదంటే స్వతంత్ర అభ్యర్థులు ఎవరో ఒకరు గెలుపు బావుటా ఎగరేస్తారో వేచిచూడాల్సిందే.

## మండలంలో 20 మందికి కరోనా పాజిటివ్

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని వేములకొండ,వర్కట్ పెల్లి,వలిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం 75 మందికి కరోనా ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి పాజిటివ్ నిర్దారణ అయిందని,వారికి కరోనా పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు తెలిపి,వారిని హెూమ్ క్వారెంటైన్ చేశామని డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు.

## వేధిస్తున్న కిట్ల కొరత

హైదరాబాద్, ఏప్రిల్ 23, :కవైపు కరోనా టెస్టులకు డిమాండ్ పెరుగుతున్నది. మరోవైపు దానికి తగినట్టుగా టెస్టుల కిట్లను సమకూర్చుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిపోతున్నది. సరిపడి నన్ని కిట్లను క్షేత్రస్థాయిలో పంపించకపోవడంతో పేద ప్రజలు టెస్టుల కోసం రోజుల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. దీంతో రాష్ట్రంలోని ప్రాథమిక కేంద్రా లు, ఏరియా ఆస్పత్రుల వరకు ప్రతిరోజూ పరిమిత సంఖ్య లోనే టెస్టులను చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పలువురు అనుమానితుల్లో సీరియస్ లక్షణాలు బయటపడుతున్నాయి. ఇదిలావుండగా పరీక్షలు చేసిన తర్వాత పాజిటివ్ వచ్చిన రోగుల మొబైల్ కు మెస్సేజ్ రూపంలో సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇందుకోసం ఇచ్చిన యాప్ పని చేయకపోవడంతో విషయం చేరవేతలో జాప్యం చోటు చేసుకుంటున్నది. దీంతో టెస్టులు చేసుకున్న అనుమానితు లు సైతం తమకు కరోనా ఉందో? లేదో? తెలియని అయోమయానికి గురవుతున్నారు.ఆక్సిజన్ ఎక్కించాల్సిన అవసరం లేకుండా రోగులను కాపాడుతుందని భావిస్తున్న రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్ల కొరత కొనసాగుతూనే ఉంది. పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు డాక్టర్లు అదే పనిగా రెమ్ డెసివిర్ ను సిఫారసు చేస్తుండటంతో దాని డిమాండ్ అమాంతం పెరిగింది.కాగా ఆయా ఆస్పత్రుల వద్ద స్టాకు లేదనీ, రోగుల బంధువులే తెచ్చుకోవాలని చెబుతుండటంతో సరఫరాదారు హెటిరో అవుట్ లెట్ల వద్దకు పరుగులు తీసిన సంగతి తెలిసిందే. భారీగా జనం రావడంతో ఆన్ లైన్ లో బుకింగ్ కోసం ఇంజెక్షన్లు కావాల్సిన వారు రోగి పేరు, ఐపీ నంబర్, అటెండర్ పేరు, మొబైల్ నంబర్, ఆస్పత్రి పేరు, నగరం పేరు, ఇంజక్షన్ల సంఖ్య వివరాలను మొబైల్ నంబర్ 91338 96969కు వాట్సాప్ లో గానీ, మాన్యువల్ మెసేజ్‌గానీ పంపించాలని సూచిస్తూ తమ కార్యాలయం ముందు సూచనలు పెట్టారు. అయితే ఫోన్లో సంప్రదించినా స్టాకు లేదని సమాధానం వస్తుండటం గమనార్హం. ప్రయివేటు ఆస్పత్రులు, ల్యాబరేటరీలపై 91541 70960కు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సూచించింది. రోగులు ఇబ్బంది పడవద్దనీ, ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని వసతులు ఏర్పాట్లు చేశామనీ, వాటిని వినియోగించుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు సూచించారు.కరోనా రోగులు అత్యవసర పరిస్థితిలో సకాలంలో చికిత్స పొందేందుకు వీలుగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న బెడ్ల తాజా వివరాలను పెడుతున్నది. అందులో ఖాళీలు చూపిస్తున్నప్పటికీ ప్రయివేటు ఆస్పత్రులు రోగులను బెడ్లు లేవని వెనక్కి పంపిస్తున్నాయి. పేద రోగులను వెనక్కి పంపించవద్దని, నిర్దేశించిన ఫీజుల కన్నా ఎక్కువ వసూలు చేయవద్దని చేస్తున్న హెచ్చరికలను పెడచెవిన పెడుతున్నాయి.హైదరాబాద్ లోని గాంధీ ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ కొరత ఉందని వస్తున్న వార్తలను ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు ఖండించారు. ఆస్పత్రిలో 20 కిలో లీటర్లు, ఆరు కిలో లీటర్ల ఆక్సిజన్ ట్యాంకులున్నాయని తెలి పారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి సీరియస్ రోగులు వస్తున్నారన్నారు. గాంధీలో చేరేందుకు ఆర్టీపీసీఆర్ రిపోర్టు తప్పని సరికాదని స్పష్టం చేశారు. రిపోర్టు లేని కారణంగా భద్రతా సిబ్బంది అంబులెన్సులను ఆపడం, వైద్యసిబ్బంది చికిత్స చేయని ఘటనల నేపథ్యంలో ఆయన సర్క్యులర్ జారీ చేశారు



## అక్రమ మట్టి తవ్వకాలను తక్షణమే ఆపేయాలి

### బీఎస్పీ జిల్లా అధ్యక్షులు యెర్రా.కామేష్

జూలూరుపాడు: మండల పరిధిలోని అక్రమ మట్టి తవ్వకాలను తక్షణమే ఆపేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.ఈ విషయమై శుక్రవారం రోజున తహశీల్దార్ లూథర్ విల్సన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గుండేపూడి గ్రామపంచాయతీ వీరభద్రపురం సమీపంలో రెవెన్యూ భూముల గుట్టలను రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి లేకుండా అక్రమ మట్టి తోవ్వకాలు జరుగుతున్న రెవెన్యూ అధికారులు స్పందించకపోకపోవడం లోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.సీలింగ్ భూమి అయిన సర్వే నెంబర్ 117,274 లలో రోజు లారీ లతో మట్టి తవ్వకాలు జరిపి, తొవ్వకాలు చేసిన మట్టిని



తహశీల్దార్ కార్యాలయం ముందు నుండి తరలిస్తున్న అధికారులు పట్టించుకొకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు.తక్షణమే అక్రమ మట్టి తొవ్వకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేనియెడల బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఖిఖమ్మం పార్లమెంటు కో-ఆర్డినెటర్ మాట్టే.గురుమూర్తి, జూలూరుపాడు మండల అధ్యక్షులు తంబర్ల. నరసింహరావు,దామోదర్, నాగరాజు,కిరణ్‌లి తదితరులు పాల్గొన్నారు

## పాఠకులకు ప్రపంచ పుస్తక దినోత్సవ శుభాకాంక్షలు

### కె.వి.నరేందర్ కథా సంకలనాలకి ప్రతిష్టాత్మక పురస్కారం



గొల్లపల్లి, ఏప్రిల్ 23 (ప్రజాపాలన ప్రతినిధి):?తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య ప్రక్రియలో కథా రచనల పోటీల్లో ప్రముఖ కథా రచయిత కె.వి.నరేందర్ సంపుటి 'కథమానంభవతి' ప్రతిష్టాత్మక సారస్వత పురస్కారానికి ఎంపికయింది. గ్రంధ రచనల పోటీ 2021 సంవత్సరానికి గాను కె.వి.నరేందర్ ప్రజాపాలన తెలుగు జాతీయ దిన పత్రిక పాఠకులకు ప్రపంచ పుస్తక దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ నా రచనలు కథమానంభవతి ఎంపికైనట్లు తెలుగు వర్సిటీ పూర్వ ఆచార్యులు ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్యలు వెల్లడించారు.కథా ప్రక్రియ విభాగానికి నరేందర్ కథమానంభవతి సంకలనం ఎంపికైంది. పురస్కారం కింద రూ.20 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నట్లు వారు తెలిపారు. కోవిడ్ పరిస్థితులు చక్కబడిన వెంటనే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా హైదరాబాద్ లో జరిగే సారస్వత పరిషత్తు ఉత్సవాల్లో నరేందర్ కు ఈ అవార్డు ని బహుకరిస్తామని వారు తెలిపారు. కాగా నరేందర్ ఈ అవార్డు రావడం పట్ల పలువురు సాహితీ మిత్రులు అభినందనలు తెలియజేశారు.

## కష్ట కాలంలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు అండగా ప్రభుత్వం

వెల్గటూర్, ఏప్రిల్ 23 (ప్రజాపాలన ప్రతినిధి) : కరోనా పరిస్థితుల్లో అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను కూడా ఆదుకునే కార్యక్రమాలు చేపట్టడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని వెల్గటూర్ ఎం.పీ.పీ కునమల్ల లక్ష్మి లింగయ్య, జెడ్పీటీసీ బి.సుధారాణి రామస్వామి శుక్రవారం రోజు ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తూ పేర్కొన్నారు. వెల్గటూర్ మండలంలో పని చేస్తున్న 44 మంది బోధనా సిబ్బందికి, 8 మంది బోధనేతర సిబ్బంది కి ప్రభుత్వం ద్వారా ఇప్పటికే వారి ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ అయ్యాయి. కాగా వారికి 25 కిలోల చొప్పున బియ్యాన్ని శుక్రవారం వెల్గటూర్ రేషన్ దుకాణంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో కె.సి.ఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. జెడ్పిటిసి సుధారాణి మాట్లాడుతూ కరోనాను ధైర్యంగా ఎదుర్కోవాలి సాధ్యమైన వరకు ఇంటివద్దనే ఉండండి అని ప్రైవేట్ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.మండల విద్యాధికారి భక్తుల భూమయ్య మాట్లాడుతూ వెల్గటూర్ మండల పరిధిలోని 52 మందితో సహా, ఇతర ప్రదేశాల్లో పని చేస్తున్న మొత్తం 87 మంది లబ్ధిదారులకు మండలంలో రేషన్ బియ్యం కేటాయించినట్లు మండల విద్యాధికారి బత్తుల భూమయ్య తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి, సర్పంచ్ మెరుగు మురళి, సింగిల్ విండో వైస్ చైర్మన్ వన్నెల నర్సింహా రెడ్డి, నాయబ్ తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఆర్.ఐ సుద్దాల స్వామి, రేషన్ డీలర్ తిరుపతి, ఎం.ఆర్.సి సిబ్బంది, దొరి శెట్టి మల్లేశం లబ్దిదారులు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల సేవలు వినియోగించుకోవాలి: గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి విశ్వవిద్యాలయంలో ఆన్ లైన్ క్లాసులు అందుకోలేకపోయిన విద్యార్థుల కోసం డిజిటల్ రిసోర్సెస్ సిద్ధం చేయాలనిసూచించారు.ఇదే సందర్భంగా ప్రతి విశ్వవిద్యాలయము తమ పూర్వ విద్యార్థుల నెట్వర్క్ రూపొందించడంతో పాటు, వారిని చాన్సలర్ కనెక్ట్స్ అల్యూమ్ని నెట్వర్క్ లో రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులు జయేష్ రంజన్, అరవింద్ కుమార్, బి. జనార్దన్ రెడ్డి, నీతూకుమారి ప్రసాద్, వికాస్ రాజ్, రాహుల్ బొజ్జ తదితరులతోపాటు కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్ పాల్గొన్నారు.

## ఇదొక వింత రోగం.. నిర్లక్ష్యం వద్దు:ఈటల

(మొదటి పేజీ తరువాయి)

ఆక్సిజన్ కొరత లేదు..

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరత లేదు అని మంత్రి ఈటల స్పష్టం చేశారు. రెండు, మూడు రోజుల్లో ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఆక్సిజన్ కొరత తీరుతుందన్నారు. మనకు ఆక్సిజన్‌ను విశాఖ నుంచి కేటాయించలేదు. 1300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశా నుంచి యుద్ధ విమానాల్లో ఆక్సిజన్‌ను తెప్పిస్తున్నామని తెలిపారు. టెస్టు కిట్ల కొరత కూడా రాష్ట్రంలో లేదన్నారు. జగిత్యాల, మహారాష్ట్రకు రాకపోకల వల్లే అక్కడ ఎక్కువ కేసులు నమోదు అవుతున్నాయని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## దేశంలోనే తొలిసారి..

### తెలంగాణకు యుద్ధ విమానాల్లో ఆక్సిజన్

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉన్న చిన్నచిన్న ఆక్సిజన్ ప్లాంట్ల నుంచి ఉన్నా యి. మిగిలిన ఆక్సిజన్‌ను బళ్లారి, భిలాయ్, అంగుల్ (ఒడిశా), పెరంబుదూర్ నుంచి తీసుకోవాలని సూచించింది. తెలంగాణకు అత్యంత సమీపంలోని బళ్లారి స్టీల్‌ప్లాంట్ నుంచి తెలంగాణకు కేటాయించింది 20 మెట్రిక్ టన్నులే. వైజాగ్‌నుంచి దాదాపు ఇంతే కేటాయించారు. భిలాయ్, పెరంబుదూర్, అంగుల్ నుంచి ఆక్సిజన్ తెచ్చుకోవడం తేలికేమీ కాదు. అవన్నీ దూరంగా ఉన్న ప్లాంట్లు. ఆయా ప్రాంతాలనుంచి ఆక్సిజన్ రావడానికి కనీసం మూడు రోజులు పడుతుండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విమాన సేవలను వినియోగించుకుంటుంది రాష్ట్రం.

## అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించిన ఎంపీపీ



మండల పరిధిలోని కెర్చిపల్లి గ్రామంలో ఎంపిటిసి నిధులు 2 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక ఎంపిపి నూతి రమేష్ రాజు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దెల మంజుల నాగరాజు,ఎంపిటిసి ఎడవెల్లి సత్తమ్మ యాదయ్య,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి గ్రామాలలో కొనసాగుతున్న శ్మశాన వాటికలు,పల్లెప్రకృతి వనాలు,నర్సరీలు పారిశుధ్య అభివృద్ధి నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ అన్నారు.శుక్రవారం మండలంలోని గోల్నేపల్లి,నేమిలేకాల్వ గ్రామాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులలో శ్మశాన వాటిక,డంపింగ్ యార్డు,పల్లెప్రకృతి వనం,నర్సరీలు ఆయన పరిశీలించి తొందరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఓ గీతారెడ్డి,పంచాయతీ రాజ్ ఏ ఈ సుగుణాకర్ రావు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పుస్తక దినోత్సవ వేడుకలు

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని గ్రంథాలయ ఛైర్మెన్ పబ్బు వెంకటరమణ శ్రీ సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాల వేసి పుస్తక ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ పుస్తకం విలువను తెలియజేసిన మహనీయులను ఈ సందర్భంగా గుర్తు చేసి గ్రంథాలయానికి పుస్తకాలను ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇంచార్జి పిట్టల ఆంజనేయులు,రాపోలు ప్రణయ్ కుమార్,కొండా చంద్రమోహన్,రెబ్బ మల్లిఖార్జున్,మైసొల్ల ప్రవీణ్,కే మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కరోనా తో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

### గిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ శ్రీనివాస్ నాయక్



పరిగి 23 ఏప్రిల్ ప్రజాపాలన ప్రతినిధి : యావత్ ప్రపంచంలోనే కరొనా సమయం లో మనకు ఎక్కడ ఏమీ జరిగిన వెంటనే సమాచారం అందిస్తున్న జర్నలిస్టులు తాము బయటకు వెళ్ళడం ప్రమాదం అని తెలిసినకుడా మనకోసం సమాజం కోసం నిరంతరం సేవలు అంధిస్తున్నారు....ప్రజలకు ప్రభుత్వానికి వారధి గా ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కారం కావాడానికి ముఖ్య పాత్ర వహిస్థున్నరు. కనుక కరొనా తో జర్నలిస్టు చనిపొతె వారి కుటుంబాలను ఆదుకోవడం మన అందరి బాధ్యత కాబట్టి ప్రభుత్వం ఆసరాగ ఉంటూ వారికి, ప్రైవేటు ఉపాధ్యాయులకు ఎలా అయితే 25 కిలోల రేషన్ బియ్యం ఇస్తున్నారో అదేవిధంగా జర్నలిస్టులకు కూడా 25 కిలోల రేషన్ బియ్యం తో పాటుగా వాళ్లను అన్ని విధాలుగా రక్షణ కల్పించాలని మరియు కరోనా మహమ్మారి గురించి ఎక్కడ ఏం జరిగినా మనకు తెలిసేలా చేసేది ఒక జర్నలిస్టు మాత్రమే కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం కావచ్చు కేంద్రప్రభుత్వం కావచ్చు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు ఆదుకున్నప్పుడు ప్రజల కోసం సమాజం కోసం ఎల్లవేళలా పని చేస్తున్నా జర్నలిస్టుల గురించి కూడా ప్రభుత్వం ఆలోచన చేయాలి అలాగే కరోన బారిన పడి చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం 25 లక్షల ఆర్థిక సహాయం అందించి వారికి నిత్యావసర సరుకులు కూడా ఇవ్వాలని లిగిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ శ్రీనివాస్ నాయక్‌లి డిమాండ్ చేశారు.. ఒక జర్నలిస్టు లేకపోతే ప్రపంచం మొత్తం అంధకారంలోనే ఉంటుందని ఆయన అన్నారు.కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలని లేనియెడల కరోనా సమయంలోనే 144 సెక్షన్ పెట్టిన ఎలాంటి షరతులు విధించిన జర్నలిస్టులతో కలిసి గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## ఐకేపీ వరిదాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం...



సారంగాపూర్, ఏప్రిల్ 23 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండలంలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి డిప్యూటీ తహశీల్దార్ సందీప్ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్ సింగిలవిండో ఛైర్మన్ ఏలేటి నరసింహారెడ్డి సర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి గంగారెడ్డి కొండ్ర రాంచందర్ రెడ్డి ఏఓ తిరుపతి నాయక్ సెర్ప్ ఏపీఎం రజిత సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హబ్సిగూడ డివిజన్లో సోడియం క్లోరైడ్ పిచికారి



మేడిపల్లి, ఏప్రిల్23(ప్రజాపాలనప్రతినిధి) : కరోనా వైరస్ వ్యాప్తి రెండో దశ ఉధృత నేపథ్యంలో హబ్సిగూడ కార్పొరేటర్ చేతన హరీష్ కరోనా వ్యాప్తి నివారణలో భాగంగా డివిజన్లోని వీధి నెంబర్ 1, పిఎస్టి కాలనీ, కాకతీయనగర్ తదితర కాలనీలలో పెద్ద ట్యాంకర్తో సోడియం క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగ్గా కార్పొరేటర్ చేతన హరీష్ స్వయంగా సోడియం క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేశారు. కరోనా వ్యాప్తి నివారించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ విధిగా ముఖాలకు మాస్కులు, సామాజిక దూరం పాటిస్తూ, అవసరమైతేనే బయటికి రావాలని కార్పొరేటర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి గీత సెల్ కన్వీనర్ రఘుపతి గౌడ్, మరియు సంజయ్ పటేల్, గ్యార రవి, న్యాలకొండ సుమన్ రావు, డివిజన్ ఉపాధ్యక్షులు కుంభం శ్రీనివాస్, డివిజన్ ఓబిసి అధ్యక్షులు అల్కాపూర్ సురేష్, కట్ట భాస్కర్, పాప్ సాయి, చింతల బాబు పాల్గొన్నార్ను.



## వెల్గటూర్ సహకార సంఘం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎం.పీ.పీ కనమాల్ల లక్ష్మీ లింగయ్య

వెల్గటూర్, ఏప్రిల్ 23 (ప్రజాపాలన ప్రతినిధి) : వెల్గటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ద్వారా నిర్వహించబడుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రములు గొడిశెలపేట. చేగ్యం, ముత్తునురు, మొక్కట్రవుపేట్, కోటిలింగాల వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజు ఎం.పి.పి కనుమల్ల లక్ష్మి లింగయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఎలెటి కృష్ణారెడ్డి, వెల్గటూరు సహకార సంఘం అధ్యక్షులు శ్రీ గోలి రత్నాకర్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వన్నెల నర్సింహ రెడ్డి, ముత్తు నగర్ గ్రామ సర్పంచ్ అనుమల తిరుపతి, ఎం.పి.టి.సి అనుమల మంజుల, సహకార సంఘం డైరెక్టర్లు సింగం రమేష్, బైరం లక్ష్మి, ఎండపల్లి సింగిల్ విండో అధ్యక్షులు గూడ రామ్ రెడ్డి, ఏ.పీ.ఎం చంద్రకళ, ఎ.ఆర్ నాగ సంకీర్త్, ఎం.పి.టి..సి,ఎ.ఈ.ఒ. మహిళా సంఘ సభ్యులు మరియు సర్పంచులు మహిళలు, రైతులు మరియు సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద మృతిలో నిందితుడు రిమాండ్



రాయికల్, ఏప్రిల్ 23 (ప్రజాపాలన): గత నాలుగురోజుల క్రితం పట్టణానికి చెందిన చిక్యాల మహేశ్వరి(22) రాయికల్ పట్టణ శివారులోని ఓ వ్యవసాయ బావిలో మృతి చెందింది. ఈ విషయమై రాయికల్ ఎస్సై ఆరోగ్యం అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతికి ప్రధాన కారణమైన నిందితుడు రాయికల్ కు చెందిన లింగంపెల్లి రాజేష్ ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల రురల్ సిఐ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు మహేశ్వరికి మరియు నిందితుడు లింగంపెల్లి రాజేష్ కు వివాహేతర సంబంధం ఉందని అయితే ఈవిషయంలో తరచు రాజేష్ కు వాళ్ళ భార్యకు గొడవలు అవుతున్నాయని ఆ గొడవల వల్ల సమాజంలో అవమానాలు ఎదురవుతుండడంతో తట్టుకోలేక ఈ అవమానాలకు కారణమైన మృతురాలిని రాజేష్ బావిలో ముంచి చంపినట్లు పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో చురుకుగా వ్యవహరించినందున ఎస్సై ఆరోగ్యం ను మరియు సిబ్బందిని సి ఐ కృష్ణకుమార్ అభినందించారు.

## వ్యాక్సినేషన్ సెంటర్లను పరిశీలించిన డిప్యూటీ సీఈవో సంధ్యారాణి



సారంగాపూర్. ఏప్రిల్ 23 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండలంలోని జడ్పీ డిప్యూటీ సీఈవో అడిషనల్ పీడీ సంధ్యారాణి సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరియు రేచపల్లి గ్రామంలో వ్యాక్సిన్ సెంటర్లను పరిశీలించారు. పర్యవేక్షణలో ఆయా వ్యాక్సిన్ సెంటర్ల యందు త్రాగునీరు టెంట్స్ ఏర్పాట్లను పరిశీలించారు. సారంగాపూర్ సెంటర్ రద్దీగా ఉన్నందున గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పోలీసుల సహకారంతో 45 సంవత్సరాలు నిండిన వారికి క్యూలైన్లు ఏర్పాటు చేయుటకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య సారంగాపూర్ ఎంపీవో శశికుమార్ బీరపూర్ ఎంపీవో రాజు మండల్ పంచాయతీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరోనా పై ప్రజలకు అవగాహనా కల్పించిన సర్పంచ్ రాజు నాయక్

### గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

పరిగి 23 ఏప్రిల్ ప్రజాపాలన ప్రతినిధి : పరిగి నియోజక వర్గం,దోమ మండల పరిధిలోని మైలారం గ్రామంలో స్థానిక సర్పంచ్ రాజు నాయక్ వార్డ్ మెంబెర్స్ తో గ్రామ పెద్దలతో పలు అంశాలు పై చర్చించటం జరిగింది. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ కరోనా బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాస్క్ ధరించి భౌతిక దూరం పాటించి అత్యవసర అవసరమైతే తప్ప బయటికి వెళ్లకూడదని సూచించారు.అల్లాగే గ్రామంలో జరిగే అభివృద్ధి పనులను చేయుట గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, ఉపసర్పంచ్. నర్సిములు, వార్డ్ మెంబెర్స్ ,హరిచందర్ జేమ్స్. ఉమలత. పి.వెంకటమ్మ. కార్యదర్శి అంజమ్మ పాల్గొన్నారు.





ప్రజాపాలన
సంపాదకీయం
శనివారం 24, ఏప్రిల్ 2021

# వాక్సి'నేషన్'కు ఇన్ని రేట్లా !?

నిజాంనియంతృత్వం మీద కలమెత్తి గళమెత్తి పోరాడిన కవి దాశరథి ఆనాడే చెప్పారు: 'సిఫార్సు లేనిదే శ్మశానమందు దొరకదు రవ్వంత చోటు, పేరుకు ప్రజలది రాజ్యం, పెత్తందార్లకే భోజ్యం' అని. దాశరథికి ఆనాటికే ఎట్లా ఎరుకైందో, శ్మశానంలో పోటీ ఉంటుందని, ఆక్సిజన్ కొరత వస్తుందని, తగినన్ని వెంటిలేటర్లు ఉండవనీ, రెమ్‌డెసివిర్ వంటి మందులు, వాక్సిన్ల ఉత్పత్తి, నిలువ, రవాణా, విక్రయాల వెనుక వ్యాపార అవసరాలు ఉంటాయని, ఐసియుల కోసం బంధువులు రోగుల్ని వీపుమీద ఎక్కించుకుని (ఇంకా ఎక్కడో మానవత్వం మిణుకు మిణుకు మంటూ వెలుగుతున్నదనిపిస్తున్నది కదూ) ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఉంటారని...బతకడానికి వీల్లేదు. చావడం తప్పదు కాని ఇప్పుడు చావు ఊళ్లోవాళ్ల ఇంటి తలుపులు తడుతూ ఉంటుంది. అంబులెన్స్ రాదు. అది వచ్చేనాటికి బతికి ఉంటే, అది తీసుకువెళితే, హాస్పటల్‌లో పడకమీది మనిషి పోతే తప్ప వీడికి (సారీ శవానికి) రవ్వంత చోటు లేదు. చనిపోవడం ఖాయం, ఎందుకంటే ఆక్సిజన్ ఉండదు, వెంటిలేటర్ పనిచేయదు. మందుల కొరత. శ్మశానానికి ప్రయాణం. అక్కడ తన కోసం పడక ఖాళీ చేసి ముందే వెళ్లిపోయిన భారతీయ పౌరుడి శవం ఇంకా తగలబడడానికి ఎదురుచూస్తూనే ఉంటుంది. ప్రభుత్వాలు అర్జంటుగా కొత్త శ్మశానాలు కట్టించాలి. పౌరులు సౌకర్యవంతంగా డిగ్నిటీతో చావడానికి అన్ని ఏర్పాట్లు చేయాలి. ఎందుకంటే చావులో డిగ్నిటీ కూడా జీవించే హక్కులో భాగమని సర్వోన్నత న్యాయస్థానం సర్వోత్తమ తీర్పు చాలా సార్లు చెప్పింది. ప్రతి చోటా ఎన్నికలు జరుగుతూ ఉంటాయి. నాయకులకు కరోనా వస్తుంది, ఎన్నికల కమిషనర్లకూ వస్తుంది. అయినా సరే ర్యాలీలు జరుగుతూ ఉంటాయి. దేవుడు, మతం, పాకిస్థాన్, హిందూ, ముస్లిం, క్రిస్టియన్, బుద్ధప్రార్థన, అఫ్ఘానిస్తాన్, దేశభక్తి, జాతీయత, కుంభమేళా, తబ్లీగీ... గాంధీ మోసం, నెహ్రూ దుర్మార్గం, మన్మోహన్ మౌనం.... ఉపన్యాసాలు దంచుతూనే ఉంటారు. మాస్కులు లేని మాస్‌లే మన వోటర్లు. ముఖం నిండా మాస్కులే మన లీడర్లు. రాష్ట్రంలో ఎన్నికలు రద్దు చేయాలని ఒక రాష్ట్ర నాయకుడు అంటాడు. పక్క రాష్ట్రం జనాలు పోతే మనకేమిటి, చస్తే చావండి. కాని మాకు ఓటేసి చావండి. అవును ఐపిఎల్ కన్న ఎక్కువ నరాలు తెగే ఉత్కంఠ కలిగించే మహావక్తల ఉపన్యాసాలు శవాలతో కూడా ఓట్లేయించగలవు. టీవీల ముందున్న వాళ్లకు మ్యాచ్ ఫిక్సింగ్‌లు ఉంటాయని తెలిసినా పట్టించుకోరు. అయినా వేసిన ఓట్లు కుప్పలు తెప్పలుగా గెలిపిస్తూ ఉంటే పదవి మత్తులోకి ఎక్కేముందు చేసిన ఒట్టు ఎందుకు గుర్తుంటుంది?మనదేశానికి ఇప్పుడు అదర్ పూనావాలా చాలా కావలసిన వాడు. అతను వాడు కాదు, గాడు, అంటే దేవుడు. ఎందుకంటే ఆయన నిర్ణయిస్తాడు వాక్సిన్ ధర. ఎవడెంతకు అమ్మాలో. రైతులకు ఈ మధ్య ఏవిధంగానైతే తమ సొమ్ముకు తాము ధర నిర్ణయించే స్వేచ్ఛను ఆర్డినెన్సుద్వారా కరుణామయి ప్రభుత్వం ఇచ్చిందో సరిగ్గా అదేవిధంగా అదర్ అదరగొడ్తాడు. ఒకే నేషన్ ఒకే మార్కెట్, ఒకే నేషన్ ఒకే రేషన్, ఒకే నేషన్ ఒకే ఎలక్షన్.. చాలు చాలు, వాక్సినేషన్ విషయంలో ఈ నేషన్ విధానం నిదానం పనికి రాదని అదర్ నిర్ణయిస్తాడు. పాపం నిర్మలమైన సీతారాములేంచేస్తారు. వారంత అమాయకులు ఏ దేశంలోనూ ఉండరు. కేంద్రం యాభైశాతం వాక్సిన్‌ను 150 రూపాయల చొప్పున అమ్మడమేమిటి? రాష్ట్రాలు అదే వాక్సిన్‌కు 400 రూపాయలెందుకు చెల్లించాలి? అదే ప్రైవేటు వాడు రూ. 600కి ఎందుకు అమ్మాలి? నేషనలైజేషన్ ప్రియులంతా ఈ రేషనలైజేషన్ చెప్పడానికి ముందుకు వస్తారా, లేక ఉంటే గింటే సిగ్గు పడతారా? యాభైశాతం వాక్సిన్లు అసలు కేంద్రానికి ఎందుకు? ఎక్కడిస్తారు ఎవరికిస్తారు, అమ్ముతారు బ్రదర్? అదర్ గారు మీకు 150 రూపాయలకే అమ్మేందుకు మీరు ఇచ్చిన తాయిలాలు ఏమయినా ఉన్నాయా? పోనీ మీరు తొడగొట్టి మెలిపెట్టి, ఈడీలతో సిబిఐతో వడిపెట్టి సాధించిన రాష్ట్రప్రభుత్వాలు బోలెడున్నాయి కదా, మిమ్మల్ని గద్దెనెక్కించిన రోగులు మీపాలిత రాష్ట్రాల్లో 150 రూపాయల వాక్సిన్‌ను 400 రూపాయలకు ఎందుకు కొనాలంట? ఏం లాజిక్కు ఏం మాజిక్కు ఇది? మీరు వ్యాపారం చేసుకోవడమే గాక, దేశమంతా ప్రైవేటు వ్యాపారం చేసుకోవడానికి ఒక్కో తలకు కరోనా భయం వైరస్ ఎక్కించి 450 రూపాయల లాభం చేసుకోవడానికి అనుమతించేందుకు ఈ అదర్ ఎవరు బ్రదర్? అదర్ ఏమైనా మనదేశానికి పాలకుడా లేక అధికారపార్టీకి అధినేతా? డీలరా లేక లీడరా? జాతి మొత్తం కరోనాతో కలవరం చెందుతూ ఉంటే క్యాబినెట్టో, పార్లమెంటో, పిఎమ్మో నిర్ణయించాల్సిన ధరలు ఈ అదర్ ఎందుకు నిర్ణయిస్తున్నాడు బ్రదర్? నా మిత్రుడు ఇంకో సవాల్ విసిరాడు. కేంద్రానికి టెరిటరీ ఏది? రాష్ట్రాల సమాహారమే కదా దేశమంటే. దేశమంటే మట్టికాదోయ్ రాష్ట్రాలోయ్ అని వీరికి ఎవరు చెప్పాలి? ఆ మధ్య మన ఎన్టీఆర్ చెప్పలేదూ కేంద్రం ఒక మిథ్య అని. రాష్ట్రాలు లేకపోతే కేంద్రం ఎక్కడ అని అడగలేదూ. చంద్రబాబుకు గుర్తులేక పోవచ్చు. కాని వెంకయ్యనాయుడిగారికి గుర్తుండే ఉంటుంది. ఏ మిథ్యా ప్రపంచానికి రూ.150కి కిలో వంకాయలు మొన్న ఫిబ్రవరిలో కొవిడ్ వాక్సినేషన్‌కు రూ.35 వేల కోట్లు కేటాయించామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. మన బ్రదర్ అదర్ నిర్ణయించిన రేటు 150 రూపాయలకు ఒక డోస్ చొప్పున రెండు డోస్‌లు ఈ దేశంలో 18 ఏళ్లు నిండిన మొత్తం (70 నుంచి 90 కోట్ల మంది) జనానికి ఈ సొమ్ముతో అందరికీ ఉచితంగా ఇవ్వవచ్చు కదా? ఆ విధంగా ఇవ్వకపోతే ఈ డబ్బంతా ఎవరికి బ్రదర్?ఇంకో క్వొశ్చన్ మార్క్ కొడవలై కోప్పడుతున్నది. ఈ 150 రూపాయల రేటు ఏ విధంగా పుట్టింది? దీనికి అయ్య వ్యాపారమూ, అమ్మ లాభాపేక్ష కాదా? ఈ పాంచాలికి ఎంత మంది భర్తలు? ఈ వాక్సినేషనలిస్టు అనే అద్భుత విజయానికి తండ్రులెందరు? అపజయం అనాథ, విజయం బహుపిత్రు సహయోగ్ అంటారు కదా? అయినా తెలియక అడుగుతాను. ఈ దేశం ఫార్మాస్యూటికల్ రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిందనీ అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ ఫార్మసీ ప్రముఖులు ఎందరో ఉన్నారని మీరే ఊదరగొడుతూ ఉంటారు కదా. ఈ రెండు కంపెనీలనే ఎందుకు ఎన్నుకున్నారు? ఓపెన్ టెండర్ పిలిచి వాక్సిన్ తయారీకి ఎందుకు అందరికీ అవకాశం ఇవ్వలేదు? ఎందుకింద ప్రేమ? అవ్యాజమైన అనురాగం చిందించడానికి వీరేమయినా శ్రీమన్నారాయణులా? ఈ కరోనా కరుణ ఎందుకుబీ ఈ మందు బాంధవ్యం ఏమిటి? ఒక్కసారి మాస్క్ తీసి మాట్లాడండి అదర్ (సారీ, బ్రదర్)? ఆర్టీఐ కింద అడిగితే ఇది వ్యక్తిగత సమాచారం అంటూ, దేశ భద్రతకు ముప్పు అంటూ వ్యాపార రహస్యాలను కాపాడే ఫిడ్యూసరీ బాధ్యత అంటూ ఇవ్వరు. ఇప్పించకుండా ఉండడానికి పునరావాస పునర్పదవీ నియమిత బాబూ భక్తులు కత్తులతో సమాచారాన్ని భద్రంగా కాపలా కాస్తూనే ఉన్నారు కదా. అధికారంలోకి వచ్చే పార్టీలకు మాత్రమే విరాళాలు ఇచ్చే గొప్ప ట్రాన్స్‌పరెంట్ ఎలక్టోరల్ బాండ్లు బండ్లకొద్దీ ఉండనే ఉన్నాయి. కనుక పార్టీలకు ఎన్నికలే ముఖ్యం. ఇక జనానికి ఆక్సిజన్ ఎందుకు? అదర్ వంటి మరో బ్రదర్ వచ్చి ఆక్సిజన్‌కు, వెంటిలేటర్లకు, ఐసియూ బెడ్‌కు, శ్మశానంలో చోటుకు, కేంద్రానికి రాష్ట్రానికి ప్రైవేట్ వర్తకులకు రకరకాల రేట్లు నిర్ణయిస్తాడు. అయినా నా తపనే కాని ఆర్టికల్ ఫోర్టీన్ గురించి అడిగే వాడెవడు. న్యాయస్థానాలు ఆధునిక దేవస్థానాలు. న్యాయం అక్కడ కళ్లకు గంతలు కట్టుకున్న దేవత. దేవుడిలాగే న్యాయమూ భక్తితో ఆరాధిస్తే తప్ప కనిపించడం సాధ్యం కాదు. కనుక రిట్ల స్తోత్రాలు చేయండి, ఆర్టికల్ మంత్రాలు చదవండి. లాయర్లకు నైవే ద్యాలు పెట్టండి. రాజ్యాంగం పుస్త కాలకు మంగళహారతులు ఈయండి. ఈ దేశంలో ఇప్పుడు కరోనాతోపాటు నడిచేది ఎన్నికలు మాత్రమే. ఓటర్లు శ్మశానాలకు, లీడర్లు శాసన సింహాసనాలకు. ఏది ఏమైనా, అదరు బ్రదరైనా బ్రదరు అదరైనా జనం భయ పడి చావొద్దు. శవ మైనా లేచి రావల సిన చైతన్యం ఇప్పుడు జాతి అవసరం. బతికున్న వారు నోరుమూసుకుంటే, కరోనా రావలసిన పనే లేదు. వాక్సిన్ పనే చేయదు. చల్ నా జీవన్ కీ కహానీ రుక్ నా మౌత్ కీ నిషానీ.

# కొవిడ్ 2.0: కేంద్రానిదే బాధ్యత

బహుమాధ్యమ యుగ నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ప్రజల పిచ్చా పాటీలో ప్రతిధ్వనించే పదునైన మాటను, వైచిత్రి ఉట్టిపడే బొమ్మను, మనస్సును కదిలించే నినాదాన్ని సరైన సమయంలో ప్రభావశీలంగా ఉపయోగించుకోవడంలో ఆయన అనితర సాధ్యుడు. ఈ ప్రచార నైపుణ్యం, మోదీ సుదీర్ఘ రాజకీయ జీవితంలో మొదటి నుంచీ ప్రదర్శితమవుతోన్న ఆయన విలక్షణ నాయకత్వ శైలి. అయితే ఎంతటి మహాయోధుడూ ఏదో ఒక సందర్భంలో విజితుడు కాక తప్పదు. ఇటీవల అటువంటి పరిస్థితే నరేంద్ర మోదీకి తటస్థించింది. కొవిడ్%--%19 కేసులు ఒకే రోజున ప్రప్రథమంగా రెండు లక్షల సంఖ్యను దాటిన దుర్దినాన ప్రధానమంత్రి పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్నారు. మోదీ సభలకు జనం రాకపోవడమా?! తండోపతండాలుగా వచ్చారు. అయితే మాస్కులు ధరించినవారు, సామాజిక దూరాన్ని పాటించిన వారు ఎంతో మంది లేరు. కొవిడ్ మహమ్మారి మహోగ్రంగా విజృంభించడం ఈ సువిశాల భారతావనిలో ఎల్లెడలా కన్పిస్తుండగా తానేదో ఒక సమాంతర విశ్వంలో నడయాడతున్నట్టుగా మోదీ వ్యవహరించారు! 'దో గాజ్ కి దూరి' (పరస్పరం రెండు గజాల దూరాన్ని పాటించండి) అని ప్రజలకు పదే పదే విజ్ఞప్తి చేసిన నరేంద్ర మోదీ, రాజకీయంలో, సమాజంలో, వైయక్తిక జీవితాలలో కొత్తదనం కోసం ఆరాటంలో కొవిడ్ నిబంధనలను పాటించకుండా తన సభలకు వెల్లువెత్తిన బెంగాలీ జన సందోహాన్ని చూసి మోదీ పులకించిపోయారు. ఈ పులకరింపు, విపత్తువేళ ప్రధానమంత్రి విధ్యుక్త ధర్మ నిర్వహణలో భాగంగా తాను చేసిన విజ్ఞప్తులను తానే విస్మరించడం కాదా? జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రధానమంత్రి తన పార్టీ తరఫున ప్రచారం చేయకుండా ఎలా ఉంటారు? ఆ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని మీరు భావిస్తే, అది, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్స్ ఫైనల్ నుంచి ఉపసంహరించుకోవాలని విరాట్ కోహ్లీని అడగడమే అవుతుంది సుమా! కొవిడ్ విషమ పరిస్థితుల దృష్ట్యా ఎనిమిది దశల బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కుదించేందుకు ఎన్నికల సంఘం తిరస్కరించింది. కాకలు తీరిన రాజకీయ ప్రచార యోధుడు అయిన నరేంద్ర మోదీ తనదైన ప్రచారోద్ధృతి శైలి నుంచి వెనక్కి తగ్గడం అసాధ్యం. ఎన్నికలు ఆయనలోని ప్రచార నిపుణుడికి ప్రాణవాయువులాంటివి. ప్రజల వద్దకు వెళతారు. తమ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో వివరిస్తారు. ప్రత్యర్థులకు ఓటు వేయడం ఎందువల్ల నిష్ప్రయోజనమో మరీ గట్టిగా చెబుతారు. ఒక అనితర సాధ్యమైన పోరాట స్ఫూర్తి ఆయన ప్రచారంలో ద్యోతకమవుతుంది. ఆయనకు అదొక ప్రామాణిక విజయ సాధనా వ్యూహం. అసాధారణ పరిస్థితులలో ఏ వ్యూహంలోనైనా మార్పులు చేర్పులు తప్పనిసరి. కొవిడ్ మహోగ్రంగా తాండవమాడుతున్న వేళ కూడా ఎన్నికల ప్రచారాన్ని సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా నవీన మార్గాలలో ఎందుకు చేయకూడదు? భారతీయ జనతా పార్టీకి డిజిటల్ సాంకేతికతల సామర్థ్యం అపారంగా ఉంది కదా. మరి తన సందేశాన్ని ప్రజలకు చేరవేసేందుకు ఆన్‌లైన్ వేదికలను ప్రధానమంత్రి ఎందుకు ఉపయోగించుకోవడం లేదు? కొవిడ్ వ్యాప్తికి అడ్డుకట్టలను పూర్తిగా కూల్చి వేస్తున్న ర్యాలీలు, రోడ్ షోలను గణనీయంగా తగ్గించేలా ఎన్నికల సంఘంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదు? ఇందుకు ప్రధానమంత్రి తన అధికారాలను ఉపయోగించుకోవడం చాలా సముచితంగానూ, ప్రశంసనీయంగానూ ఉండేది కాదూ? నిజమైన నాయకత్వ లక్షణమేమిటి? మందలో కలవకుండా మిగతా వారికంటే ఒక అడుగు ముందుండి మార్గదర్శకత్వం నెరపడమే కాదూ? మరి మోదీ ఇలా ఎందుకు వ్యవహరించడంలేదు? దురదృష్టవశాత్తు మన సమాజ జీవితం మితిమీరిన స్థాయిలో రాజకీయాకరణ అయిపోయింది. సామాజిక చీలికలు పెరిగిపోయాయి. ఆర్థిక అసమానతలు సరేసరి. ఇటువంటి పరిస్థితుల్లో ఏ విషయమూ రాజకీయాలకు అతీతం కాబోదు. సరిగ్గా ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇప్పుడు మోదీ ప్రభుత్వం చిక్కుకొంది. కొవిడ్ విపత్తును ఎలా ఎదుర్కోవాలనే విషయమై విధాన నిర్ణేతలు తమ దృష్టిని కేంద్రీకరించాల్సిన సమయంలో మోదీ ప్రభుత్వంపై రాజకీయ దాడులు ముమ్మరమయ్యాయి. గత ఏడాది మోదీ సర్కార్ పలు విభిన్న పోరాటాలు చేయవలసివచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ప్రతిపక్షాల ప్రభుత్వాలను కూల్చివేయడం, ఆర్థిక వనరుల పంపకం విషయమై రాష్ట్ర ప్రభుత్వాలతో వివాదాలు, ఇప్పుడు బెంగాల్‌లో దేశ రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయగల ఎన్నికల సమరం! చైనాతో ఘర్షణలు ఆ దేశ సామ్రాజ్యవాద విస్తరణ ఆకాంక్షల ఫలితమేనని పాలకులు చెప్పారు. మరి ఇంచుమించు ఐదు నెలలుగా ఉత్తర భారతావని రైతులు చేస్తున్న పోరాటం విషయమేమిటి? ఎందుకు అది ఎడతెగకుండా కొనసాగే పరిస్థితిని మోదీ ప్రభుత్వం కల్పించింది? కనీవినీ ఎరుగని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిపై పోరాడేందుకు మరింత విస్తృత స్థాయిలో ఏకాభిప్రాయాన్ని సాధించాల్సిన సమయంలో కొత్త వ్యవసాయ బిల్లులకు హడావుడిగా పార్లమెంటు ఆమోదం పొందాల్సిన అవసరమేమిటి? బిల్లులను తెచ్చే ముందు రైతులతో ఎందుకు సంప్రదించలేదు? ఈ సంక్లిష్ట రాజకీయ వ్యవహారాలు అన్నీ అసలు సమస్యపై మోదీ ప్రభుత్వం ఏకాగ్ర దృష్టి నిలవకుండా చేశాయనడంలో సందేహం లేదు. దీనికితోడు తమ నిర్ణయాలు అమోఘమైనవని, ప్రజలు వాటిని తప్పక ఆమోదిస్తారనే మితిమీరిన విశ్వాసం పాలకుల వివేచనను కుంటుపరిచిందని చెప్పక తప్పదు. గత నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో లభించిన విజయంతో తమ రాజకీయ ఎజెండా ఏదైనా సరే ప్రజలు పూర్తి మద్దతు నిస్తారనే విశ్వాసం మోదీ ప్రభుత్వంలో పెరిగిపోయింది. ఇదిలా వుంటే కొవిడ్ విపత్తు కొంచెం నెమ్మదించడంతో ప్రజలు తాము విధిగా పాటించాల్సిన జాగ్రత్తలపై నిర్లక్ష్యం చూపసాగారు. కేంద్ర ప్రభుత్వం కూడా తమ దక్షత వల్లే కొవిడ్ తగ్గు ముఖం పట్టిందని గట్టిగా విశ్వసించింది. ప్రజలను అంతగా కట్టడి చేయకపోయినా పరిస్థితి అదుపులో ఉంటుందనే భరోసాకు పాలకులు వచ్చారు. ఈ 'సానుకూల' పరిస్థితులు అన్నీ మోదీ ప్రభుత్వం అనుసరించిన వాక్సిన్ విధానం ఫలితమేనని పాలకపక్ష మద్దతుదారులు భావించారు. కరోనాను ప్రభుత్వం ఓడించిందని జయపతాకలు ఎగురవేశారు. విపత్తు పరిస్థితులు మరింతగా దిగజారిపోయిన పక్షంలో చేపట్టవలసిన చర్యలకు సంసిద్ధమవ్వాల్సిన సమయంలో వేడుకలు జరుపుకోవడం సబబేనా? అసలు మోదీ సర్కార్ అనుసరించిన వాక్సిన్ విధానాన్ని నిశితంగా ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉదాహరణకు మార్చి మూడో వారం వరకు తన సొంత పౌరులకు వేసిన టీకాల కంటే అత్యధిక స్థాయిలో వ్యాక్సిన్లను భారత్ ఎగుమతి చేసింది! (దేశంలో కేవలం 5.2 కోట్ల మందికి మాత్రమే టీకా వేసిన భారత్ అదే సమయంలో 76 దేశాలకు ఆరు కోట్ల డోసుల వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసింది! ఇదెలా జరిగింది? దౌత్య ప్రయోజనాల కోసం వాక్సిన్ వితరణను, దేశానికి 'విశ్వ గురు' ప్రతిష్ఠను నిర్మించే ప్రయత్నాలను దేశంలో కొవిడ్-%--%19 పరిస్థితి సంపూర్ణంగా అదుపులోకి వచ్చేంతవరకు ఎందుకు వాయిదా వేయులేకపోయారు? వాక్సిన్ ప్రత్యామ్నాయాల సంఖ్యను పరిమితం చేశారు. సరైన విధంగా వాక్సిన్ సరఫరా ఆర్డర్లను ఉత్పత్తి సంస్థలకు ముందుగా ఇవ్వడంలో అలసత్వం చూపారు. ప్రతి రాష్ట్రానికి వాక్సిన్ పంపిణీ విషయంలో కఠినమైన 'కోటా-పర్మిట్' విధానాన్ని అనుసరించారు. వాక్సిన్లను మరింత ముమ్మరంగా, మరింత శీఘ్రంగా ఉత్పత్తి చేసేలా ప్రైవేట్ సంస్థలకు తగు ప్రోత్సాహకాలనివ్వలేదు. అన్ని వయస్సులవారికీ టీకా వేయించే విషయాన్ని ఉపేక్షించారు. వాక్సిన్ విధానం అమలుకై ఒక ఉద్యోగస్వామ్య సంబంధిత క్లిష్ట వ్యూహాన్ని సృష్టించారు. తత్ఫలితంగానే అత్యంత కీలక సమయంలో వాక్సిన్‌లు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రజల సమస్యలు మిక్కుటమయ్యాయి. వాక్సిన్ల ఉత్పత్తిలో ప్రపంచ అగ్రగామి దేశం ఇప్పుడు నైరాశ్యంతో వాక్సిన్లను దిగుమతి చేసుకోవల్సిన దుస్థితి నెదుర్కొంటున్నది. ఈ పరిస్థితి, కరోనా మహమ్మారిపై పోరు సుదీర్ఘమైనదీ, సంక్లిష్టమైనదీ అన్న సత్యాన్ని స్పష్టం చేస్తోంది. ఈ శోచనీయ పరిస్థితులకు మోదీ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ప్రతిపక్షాలు నిందిస్తున్నాయి. రెండో దఫా కొవిడ్ విజృంభణ గురించి నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ ఆ క్లిష్ట పరిస్థితినెదుర్కొనేందుకు మోదీ సర్కార్ ఎందుకు సంసిద్ధమవలేదని విపక్షాలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నాయి. కొవిడ్ విపత్తును అదుపు చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలలో చాలా లొసుగులు ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ హెచ్చరిస్తూనే ఉన్నారు. అయితే అధికారపక్షం వారు ఆయన హెచ్చరికలను కొట్టివేస్తూ వచ్చారు. సరే, కాంగ్రెస్ పాలనలో ఉన్న రాష్ట్రాలలో కొవిడ్‌పై పోరు బీజేపీ పాలిత రాష్ట్రాలలో కంటే మెరుగ్గా ఉందా? వైరస్‌కు రాజకీయ హద్దులు తెలియవు. మహమ్మారిని అదుపు చేసేందుకు మహా మంత్రమేదీ ఎవరి వద్దా లేదు. పరిష్కారాన్ని కనుగొనడానికి వేయవలసిన మొదటి అడుగు సమస్యను అంగీకరించడం, దానినెదుర్కోవడంలో జరిగిన తప్పులను ఆమోదించడం, ఆ తరువాత దిద్దు బాటు చర్యలు తీసుకోవడం. ఈ కారణంగానే భారత ప్రభుత్వ వాక్సిన్ విధానంలో ఇటీవల జరిగిన మార్పులు సరైన దిశలో వేసిన ముందడుగుగా చెప్పి తీరాలి. అయితే కొవిడ్ విపత్తు అదుపు బాధ్యతను మోదీ ప్రభుత్వం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలపై మోపకూడదు. 'కొత్త' భారతదేశంలో సిద్ధించిన విజయాలన్నీ తమ ఘనతే అని చెప్పుకొంటున్న కేంద్ర ప్రభుత్వం కొవిడ్‌పై పోరులో వేసిన తప్పటడుగులకూ తన వంతు బాధ్యతను అంగీకరించి తీరాలి. కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం అధికారాలు అన్నిటినీ కేంద్రీకరించింది. విధాన నిర్ణయాలన్నీ ప్రధానమంత్రి కార్యాలయంలో ఏకపక్షంగా తీసుకోవడం జరుగుతోంది. కొవిడ్‌పై పోరులో 'ప్రైమ్ మినిస్టర్స్ కేర్ ఫండ్' ద్వారా నిధులు ఏ మేరకు వ్యయం చేయడం జరిగిందనే విషయమై ప్రాథమిక సమాచారాన్ని కూడా వెల్లడించడం లేదు. అయినప్పుడు జరగాల్సిన పనులు సవ్యంగా జరగనప్పుడు అందుకు మోదీ ప్రభుత్వమే జవాబుదారీ కావాలి. కొవిడ్‌పై పోరులో జరిగిన తప్పులు అన్నిటికీ బాధ్యత పూర్తిగా మోదీ సర్కార్‌దే. ఇది సందేహాతీతమైన నిజం.



# మెరిడియన్ స్కూలులో డ్రైవ్ ఇన్ కరోనా పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించిన అపోలో డయాగ్నస్టిక్స్




శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : భారత దేశంలో సెకండ్ వేవ్ లో భాగంగా నానాటికీ పెరుగుతున్న కరోనా కేసుల కారణంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించే సంస్థలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. మౌళిక వసతుల పరిమితుల కారణంగా ప్రభుత్వ మరియు ప్రైవేటు హాస్పిటల్స్ లో ఉన్న పరీక్షా కేంద్రాలు నానాటికీ పెరుగుతున్న రోగుల సంఖ్యకనుగుణంగా సేవలు అందించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో కోవిడ్ వ్యాధి నిర్ధారణలో కీలకమైన కోవిడ్-19 ఆర్ టి పీసీయార్ (ఐసియంఆర్ వారి అనుమతులకనుగుణంగా) పరీక్షలకు వారికి అందించడానికై వీలుగా అపోలో డయాగ్నస్టిక్స్, అపోలో హెల్త్ మరియు లైఫ్ స్టైల్ లిమిటెడ్ వారి డయాగ్నస్టిక్ విభాగం వారు హైదరాబాదులో ప్రత్యేకమైన డ్రైవ్ ఇన్ పరీక్షా కేంద్రాలను నెలకొల్పాలని నిర్ణయించారు. తద్వారా వందలాది మంది పౌరులకు త్వరిత గతిన కరోనా చికిత్స అందించ డానికి వీలు కలుగనుంది. ఇలా నెలకొల్పబడుతున్న పరీక్షా కేంద్రాలలో రోజూ 250 మంది పేషెంట్ల వరకూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగలిగే సదుపాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. హైదరాబాదులో మొట్ట మొదటి సారిగా నెలకొల్పబడుతున్న ఈ డ్రైవ్ ఇన్ కరోనా పరీక్షా కేంద్రాన్ని మెరిడియన్ స్కూలు, మాదాపూర్ లో నేడు శుక్రవారం 23 ఏప్రియల్ నుండి ప్రారంభించడం జరిగింది. ఈ కేంద్రం ద్వారా ప్రధానంగా గచ్చిబౌలి, కూకట్ పల్లి, మాదాపూర్, కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు మరియు కొండాపూర్ వాసులకు సేవలు అందిస్తుంది. ఈ పరీక్షా కేంద్రానికి వచ్చే వారు మెరిడియన్ స్కూలు, గేట్ నెం.2 (మాదాపూర్ బ్రాంచ్) వద్ద నుండి రావాల్సి ఉంటుంది. ఈ పరీక్షా కేంద్రానికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభతరమైన ఐదు అంశాలతో కూడిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏర్పాటు చేయడం జరిగింది. 1) పరీక్షా కేంద్రానికి వచ్చే వారు తమ నమోదు కార్యక్రమాన్ని మొబైల్ లో క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా చేసిన వెంటనే వారి మొబైల్ లో టోకెన్ అందచేయడం జరుగుతుంది. 2) టోకెన్ అందుకొన్న తర్వాత పరీక్ష చేయించుకోదలచిన వారు తగిన రుసుము ఆన్ లైన్ లోనే చెల్లించి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. 3) టోకెన్ నెంబర్ ఆధారంగా ఫెల్బొటోమిస్టు (పరీక్ష నిర్వహించే నిపుణులు) నమూనాలను సేకరిస్తారు. 4) నమూనాను సేకరించిన వెంటనే పరీక్ష చేయించుకొన్న వారి మొబైల్ లో వివరములతో పాటూ బిల్లు కూడా మెసేజ్ ద్వారా అందుతాయి. పరీక్షకు వచ్చే వారు తమతో పాటూ ప్రభుత్వం పేర్కొన్న విధంగా తగిన గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్ లేదా పాన్ కార్డ్ ) ను తమ వెంట తెచ్చుకోవాలి. 5) పరీక్షానంతరం అపోలో డయాగ్నస్టిక్స్ వారు 48-72 గంటలలోగా రిపోర్టును ఆన్ లైన్ లోనే అందించడం జరుగుతుంది. ఈ ప్రక్రియ అంతా మానవ రహితంగా మొత్తం ఆన్ లైన్ లోనే సాగుతుంది. రానున్న రోజులలో అపోలో డయాగ్నస్టిక్స్ వారు హైదరాబాదులో ఇలాంటి మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ కొత్త పరీక్షా కేంద్రాల వివరాలను ఎప్పటికపుడు అపోలో డయాగ్నస్టిక్స్ వారి వెబ్ సైట్ [illegible] లో ఉంచడం జరుగుతుంది. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన మరింత సమాచారం కోసం అపోలో డయాగ్నస్టిక్ కస్టమర్ కేర్ వారిని 040-44442424 లో సంప్రదించగలరు.

### కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



మేడిపల్లి, ఏప్రిల్23 (ప్రజాపాలన ప్రతినిధి)కరోనా వైరస్ వ్యాప్తి విజృంభిస్తున్న నేపథ్యంలో ఉప్పల్ కార్పొరేటర్ మందముల్ల రజితపరమేశ్వర్ రెడ్డి పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి శుక్రవారం డివిజన్లో పారిశుద్ధ్యం ప్రత్యేక డ్రైవ్ పై విస్తృతంగా పర్యటించారు.డివిజన్లోని లక్ష్మి నారాయణ కాలనీ ,మురికివాడల్లో ఎక్కడ కూడా చెత్త లేకుండా తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ వెంటనే అక్కడ సోడియం హైపోక్లోరైట్ ను పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ కాలనీ అధ్యక్షులు లూకాస్, బొడ్డు రవీందర్, పెద్ద వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి, పాయసం గోపాల్, శ్రీధర్ ప్రసాద్, యాదగిరి, పి నరసింహ, పూర్ణ చంద్ర రెడ్డి ,సత్తయ్య యాదవ్ ,సిహెచ్ శంకరయ్య ,వల్లూరి శ్రీనివాస్ ,మీసాల రాములు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ కరోనా వ్యాక్సిన్ తీసుకోవాలి

కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్



మేడిపల్లి, ఏప్రిల్23 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రతి ఒక్కరూ 45 సంవత్సరాలు పైబడిన వారు కరోనా వ్యాక్సిన్ను తప్పకుండా తీసుకోవాలని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. ఉప్పల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కరోనా వ్యాక్సిన్ వేయించుకున్నారు.ఈ సందర్భంగా బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ కరోనా టీకా పై ఎటువంటి అపోహలకు గురి కాకుండా టీకాను వేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్వైజర్ ప్రకాష్, సిబ్బంది మరియు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### పంచాయతీ రికార్డులను ఆకస్మికంగా తనకి చేసిన మండల పంచాయితీ అధికారి సురేష్



పరిగి 23 ఏప్రిల్ ప్రజాపాలన ప్రతినిధి :పరిగి నియోజక వర్గం దోమ మండల పరిధిలోని దోర్నాల పల్లి గ్రామ పంచాయితీని మండల పంచాయితీ అధికారి సురేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పంచాయితీ రిజిస్టర్ లను, నర్సరీ లోని మొక్కలను,డంపింగ్ యార్డ్, క్రిమిటోరియం లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య సాగర్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టు నాగరాజుకు అశ్రునివాళి..






సిద్ధిపేట(ప్రజాపాలన ప్రతినిధి) :రెండు రోజులక్రితం హఠాన్మరణం చెందిన సిద్దిపేట ఈనాడు రిపోర్టర్ చింత నాగరాజుకు సిద్ధిపేట జర్నలిస్టులు అశ్రునివాళులు అర్పించారు.. %ఖఔజీ(× జీ ఖ%) సిద్దిపేట జిల్లా శాఖ,సిద్దిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి,ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పెద్ది సుభాష్,సంఘం జిల్లా నాయకులు నెల్లుట్ల వెంకట రమణారావు అరుణ్ కుమార్,రఘు,సంజీవరెడ్డి, బబ్బురు రాజు,నంట శ్రీనివాస్ రెడ్డి, మైసా రెడ్డి, సతీష్, జీకురు పరమేశ్వర్,రాజు, పత్రి ప్రకాష్, ద్రాం రెడ్డి,రాజ బాబు, వికాస్,ఇంద్ర శేఖర్,మురళి,ఈనాడు సాయి,వెంకట్,వాజిద్, జనం సాక్షి వెంకట్,రామకృష్ణ, గిరి,వెంకట్, తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు..ఈ సంధర్భంగా నాగరాజు కు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు..నాగరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రంగాచారి మాట్లాడుతూ సిద్దిపేట కేంద్రంగా ఈనాడు దిన పత్రికలో దాదాపు 15 సంవత్సరాలు పని చేసిన జర్నలిస్టు చింత నాగరాజు పత్రికా రంగానికి,సమాజానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు..ఈ ప్రాంతం లో అనేక ప్రజా సమస్యల పై అద్భుతమైన వార్తా కథనాలు రాసి అటు ప్రజలను,ఇటు ప్రభుత్వాలను కదిలించాడని కొనియాడారు..జర్నలిజాన్ని ప్రొఫెషన్ గా తీసుకొని అనునిత్యం వార్తల కోసం పరితపించిన ఉత్తమ జర్నలిస్టు నాగరాజు మరణం ఈ ప్రాంత పత్రికా రంగానికి తీరని లోటని అన్నారు..ఒక మంచి జర్నలిస్టును కరోనా బలితీసుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు..కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో జర్నలిస్టు లందరూ అత్యంత అప్రమత్తంగా తమ విధులను నిర్వర్తించాలని కోరారు..

## మీర్ పేట్ కార్పొరేషన్ మేయర్ వ్యాక్సిన్ తీసుకున్నారు



బాలపూర్:(ప్రతినిధి) ప్రజా పాలన : అందరూ భయపడకుండా కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలని కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ పి హెచ్ సి సెంటర్లో మీర్ పేట్ మేయర్ దుర్గ దీపు లాల్ చౌహన్, కార్పొరేటర్ ఇంద్రవత్ రవి నాయక్ కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.... యావత్ తెలంగాణ ప్రజలందరూ ముఖ్యంగా కార్పొరేషన్ ప్రజలందరికీ కోవిడ్ 19 వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటూ, కరోనా వైరస్ వ్యాప్తి చెందిందని, ప్రతి ఒక్కరూ భయపడకుండా గా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ కార్పొరేషన్ కమిషనర్ బి. సుమన్ రావు, డి ఈ సత్యనారాయణ, కార్పొరేషన్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## యువత స్ఫూర్తిని నింపేలా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం




శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : భేరి రామచందర్ యాదవ్ సేవలు అమోఘమని, వారిసేవలు ఎంత కొనియాడిన తక్కువే నని, భేరి సేవే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని, ప్రస్తుతం బ్లడ్ బ్యాంకుల్లో రక్తం తగ్గిపోతుండడంతో తలసేమియా, ఇతరత్రా వ్యాధిగ్రస్తులకు రక్తం ఉపయోగపడుతుందని, రక్త దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం చాలా గొప్ప విషయమని, యువతలో స్ఫూర్తిని నింపేలా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసిన ప్రతినిధులను, రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలను ప్రత్యేకంగా ఎంఎల్ఏ అరికేపూడి గాంధీ అభినదించడం జరిగినది. గచ్చిబౌలి డివిజన్ నేతాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ యూత్ ఆధ్వర్యంలో రెడ్క్రాస్ వారి సౌజన్యంతో రక్తదానశిబిరం ఏర్పాటు చేసారు. రక్తదాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి విజయవంతం చేశారు. ముఖ్య అతిథులుగా ఎం ఎల్ ఏ అరికేపూడి గాంధీ, మియాపూర్ ఏసీపి కృష్ణప్రసాద్, చందనగర్ సిఐ రవీందర్, సైబరాబాద్ కమిష్నర్, ఏసై ఫిలిప్, గుల్మోహర్ పార్క్ ప్రెసిడెంట్ షేక్ ఖాసిం, జనరల్ సెకరెట్రి నిరంజన్ రెడ్డి, గోకుల్ ఎన్.శ్రీధర్ యాదవ్, వనజ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (సంగారెడ్డి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అవసరమైన వారికీ రక్తం ఇవ్వడమంటే ప్రమాదంలో ఉన్న వారికీ ప్రాణం నిలపడమేననే అటువంటి రక్తం దానం చేయడానికి ప్రతి ఒక్కరూ సేవా భావంతో, ఐక్యమత్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు రక్తందానం చేయడానికి ప్రజలు స్వచ్చందంగా ముందుకు రావాలని, ముఖ్యంగా యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అన్ని దానాలలో రక్తదానం గొప్పదని, రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి వేరొకరికి ప్రాణ దాతలుగా నిలబడాలని సూచించారు.

### సంక్షోభంలోను అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం - ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల, ఏప్రిల్ 23 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని 45 వ వార్డులో పలు అభివృద్ధి పనులైన సిసి రోడ్డు డ్రైనేజీ పనులకు స్థానిక ఎమ్మెల్యే డా. సంజాయ్ కుమార్ భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కరోనా మహమ్మారితో దేశవ్యాప్తంగా సంక్షోభం ఉన్న అభివృద్ధి ఆగకూడదన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ పట్టణాలు పల్లెలు తేడ లేకుండ నిధులిస్తూ సంక్షేమానికి అత్యంత ప్రాధ్యాన్యత ఇస్తున్నారని అన్నారు. గత ఏడాది ఇతర రాష్ట్రాల నుండి వలస కూలీలు జిల్లాలో ఉండగా వారిని సైతం ఆదుకుని మానవత్వం చాటుకున్నమని తెలిపారు. ఇక ఏడాదిగా ప్రైవేటు టీచర్ల పరిస్థితి అగమ్య గోచరంగా తయారు కావడంతో వారికి సైతం 2 వేల రూపాయల నగదు సాయంతో పాటు 25 కిలోల సన్నబియ్యం ఇవ్వడం జరుగుతుందని అన్నారు .కరోనా కట్టడికి ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని విధిగా మాస్క్ ధరించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని ఆస్పత్రుల్లో బెడ్స్ ప్రాణవాయువు లభించని పరిస్థితి నెలకొన్నందున వ్యక్తిగత జాగ్రత్త వహించటమే శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ స్తానిక కౌన్సిలర్ బొడ్ల జగదీష్ కౌన్సిలర్లు గుగ్గిళ్ళ హరీష్ కప్పల శ్రీకాంత్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్ రవి వంశీ నవీన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే కేతిరి సాయిరెడ్డి పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించిన మంత్రి ఈటెల కార్పొరేటర్



వేండి పల్లి, ఏప్రిల్ 23 (ప్రజాపాలన ప్రతినిధి) చిల్కానగర్ డివిజన్ కళ్యాణ్ పురి కాలనీలో హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే కేతిరి సాయిరెడ్డి పార్థివ దేహానికి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ మరియు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మదిరాజ్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతిన తెలిపారు.

### మన ఆరోగ్యం బాగుండాలి అంటే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కార్పోరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : చందానగర్ డివిజన్ లోని ఓల్డ్ బాంబే రోడ్డు నుంచి అమీన్ పూర్ వరకు రోడ్డు ఇరువైపుల పారిశుధ్య పనులను జిహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి శుక్రవారం నాడు చందానగర్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంజుల రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రహదారి ఇరువైపుల పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు ఆదేశించారు. కరోనా రోజురోజుకు విజృంభిస్తున్న వేళ ప్రజలు ఇంటి చుట్టూ పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లోని తడి పోడి చేత్తను వేరువేరుగా జిహెచ్ఎంసీ ఆటో వారికి అందించాలన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. చేత్తను ఏక్కడంటే అక్కడ పాడేస్తే వారిపై చర్యలు తిసుకుంటామని హెచ్చరించారు. షాపు యజమానులు రోడ్ల పై చేత్తను పాడేయకుండా చెత్త కుండిలను ఏర్పాటు చేసుకోవాలని వాటిని చెత్త ఆటో వారికి అందించాలన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు,పోలీసులు, పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారని ప్రజలు వారికి సహకరించాలన్నారు.

### లింగంపల్లి నాలా పూడికతీత పనుల పరిశీలించిన ఎమ్మెల్యే, కార్పోరేటర్



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : నాలా పూడికతీత పనుల్లో వేగాన్ని పెంచాల్సిందిగా అధికారులకు ప్రభుత్వ విప్ అరికేపూడి గాంధీ ఆదేశించారు. శుక్రవారం చందానగర్ డివిజన్ పరిధిలోని లింగంపల్లి నాలా పూడికతీత పనులను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, మియపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్ లతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనుల్లో వేగం పెంచాల్సిందిగా సూచించారు. వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వకుండా చూడాలన్నారు. భారీ నుంచి అతి భారీ వరదలు వంచిన ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ఎన్నికలు వాయిదా వేసి ప్రజలను రక్షించండి

**గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌కు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ**

**కరోనా సెకండ్ వేవ్ లో రాష్ట్ర ప్రభుత్వం చాలా నిర్లక్షంగా వ్యవహారిస్తుంది**

**మునిసిపల్ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు కరోనా బారిన పడతారు**

**ప్రభుత్వ నిర్ణయానికే రాష్ట్ర ఎన్నికల సంఘం తలోగ్గుతుంది**

**తక్షణమే జోక్యం చేసుకోవాలన్న ఉత్తమ్**



హైదరాబాద్,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌కు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రంలో కరోనా తీవ్ర స్థాయిలో ఉందని.. ఈ సమయంలో మునిసిపల్ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు తీవ్రంగా కరోనా బారిన పడతారని ఉత్తమ్ గవర్నర్‌కు వివరించారు. కరోనా సెకండ్ వేవ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా నిర్లక్షంగా వ్యవహారిస్తుందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికే రాష్ట్ర ఎన్నికల సంఘం తలోగ్గుతుందని ఉత్తమ్ గవర్నర్‌కు వివరించారు. ఇలాంటి భయంకరమైన పరిస్థితుల్లో గవర్నర్ జోక్యం చేసుకోవాలని.. ఎన్నికలు వాయిదా వేసి ప్రజలను రక్షించాలని ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. "రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనేది రాజ్యాంగబద్ధమైన సంస్థ. 1993 లో రాజ్యాంగంలోని 73, 74 వ రాజ్యాంగ సవరణ అనంతరం రాష్ట్రాలలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఉనికిలోకి వచ్చింది. అయితే ప్రస్తుత తరుణంలో మునిసిపల్‌ను నిర్వహించడంలో తెలంగాణ ఎస్ఈసీ అనాలోచిత ప్రవర్తన, అత్యంత వక్షపాత వద్ధతిని వేము మీ దృష్టికి తీసుకువస్తున్నాం. జాతీయ అత్యవసర సమయంలో 2 మునిసిపల్ కార్పొరేషన్లు, 5 మునిసిపాలిటీలలో ఎన్నికలను కొనసాగించడం రాష్ట్ర ఎన్నికల సంఘం అనాలోచిత నిర్ణయానికి పరాకాష్ట. ఎస్ఈసీ ఏదైనా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు అన్ని పార్టీ సమావేశాలను నిర్వహించే పద్ధతిని ఇప్పుడు నిలిపివేసింది. ఎన్నికల సంబంధిత సమస్యలపై ప్రాతినిథ్యం వహించాలనుకునే ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులను కలవడానికి కూడా ఎన్నికల కమిషనర్ ఇష్టపడరు. కోవిడ్ -19 పాండమిక్ సెకండ్ వేవ్ కొత్త రికార్డ్ సంఖ్యలను తాకిన తరువాత కూడా, నోటిఫికేషన్ మరియు రిజర్వేషన్లు 2021, ఏప్రిల్ 15 న ప్రకటించబడ్డాయి. షెడ్యూల్ నోటిఫికేషన్, రిజర్వేషన్లు తొందరపడి ప్రకటించబడ్డాయి. అదే రోజున, ఏప్రిల్ 15న నామినేషన్లు ప్రారంభించబడ్డాయి. ఏప్రిల్ 16న దేశంలో, తెలంగాణలో కూడా భారీ రెండో కోవిడ్ వేవ్ ప్రారంభమైన తరువాత నోటిఫికేషన్ జారీ చేశారని గౌరవ గవర్నర్ దృష్టికి తీసుకువస్తున్నాం. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కోవిడ్ చికిత్స ఉచితంగా ఉండగా, కోవిడ్ చికిత్సను తెలంగాణలోని ఆరోగ్యశ్రీలో చేర్చలేదు. నిన్నటి నాటికి తెలంగాణలో అసలు పరిస్థితి ఏమిటంటే, క్లిష్టమైన కోవిడ్ రోగుల కోసం ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రిలో ఒకే వెంటిలేటర్, బెడ్ అందుబాటులో లేదు. రాష్ట్రంలో ఆక్సిజన్, వ్యాక్సిన్ల కొరత తీవ్రంగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో రోజువారీ కోవిడ్ మరణాల సంఖ్య ప్రతి రోజు కొత్త రికార్డు స్థాయికి చేరుకుంటుంది. ప్రస్తుత పరిస్థితి "జాతీయ అత్యవసర పరిస్థితి" అని సుప్రీంకోర్టు పేర్కొంది. పైన పేర్కొన్నవన్నీ ఉన్నప్పటికీ, మునిసిపల్ ఎన్నికలను కొనసాగించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. అంతేకాక, ఎస్ఈసీ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తుంది. ఎన్నికలను కొనసాగించడం ద్వారా, 2 మునిసిపల్ కార్పొరేషన్లు, 5 మునిసిపాలిటీలలో లక్షల మంది ఓటర్ల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. ప్రస్తుత సమయంలో ఎన్నికల ప్రక్రియను ఆపివేయడం లో కోవిడ్ -19 వేవ్ తగ్గిన తర్వాత ఎన్నికలను కొనసాగించాలని ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవాలని కోరుతున్నాం." అని ఉత్తమ్ లేఖలో కోరారు.

## దోమ మాజీ కారోబార్ మృతి



పరిగి 23 ఏప్రిల్ ప్రజాపాలన ప్రతినిధి : తీవ్ర అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన దోమ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. దోమ గ్రామానికి చెందిన మఠం హరనేత్రయ్య 93 సం,లు అనారోగ్యంతో శుక్రవారం రోజు సాయంకాలం చనిపోయాడు. అతను చాలా కాలం నుంచి దోమ గ్రామ పంచాయతీ కార్యాలయ%శీ% లో కారోబార్ గా పని చేసాడు. అతని మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## నాణ్యత గల వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

**జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

మంచిర్యల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23,ప్రజాపాలన. జిల్లాలోని రైతులు నాణ్యత గల వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెటి పేట మండలం మిట్టపల్లి గ్రామం, హాజీపూర్ మండల కేంద్రాలలో ఏర్పాటుచేసిన సహకార సంఘ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి కాలానికి సంబంధించిన వరి ధాన్యాన్ని కనీస మద్దతు ధర పొందేందుకు సంబంధిత రైతులు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. రైతులు పొలంలోనే తప్ప, తాలు తూర్పార పట్టాలని, శుద్ధిచేసిన నాణ్యతగల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. అనంతరం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కేంద్రం పనితీరు, నిర్వహణకు సంబంధించిన విషయాలపై చర్చించారు. రైతులకు టోకెన్లు, కొనుగోలు పత్రాల జారీ, నాణ్యతలేని వరి ధాన్యం కొనుగోలులో నిర్వాహకులపై చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.





## ప్రయాణికుల భద్రత ఆర్టీసీ లక్ష్యం:డిపో మేనేజర్ కృష్ణమూర్తి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి:కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ కృష్ణ మూర్తి తెలిపారు. కేసులు పెరుగుతున్న సందర్భంగా శుక్రవారం డిపో పరిధిలో బస్సులను ఇతర ప్రాంతాలను స్థానిక చేయడంతోపాటు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత కు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా కరుణ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున సానిటేషన్ కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. సిబ్బంది మొత్తం 33 రకాల సూత్రాలు పాటించినట్లయితే ఆర్టీసీ ప్రయాణికులకు మంచి సేవలు అందించడమే కాకుండా లాభాల బాట పట్టే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రయాణికుల సౌకర్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వైరస్ నివారించడానికి సిబ్బంది ప్రయత్నించాలన్నారు. దీనికోసం ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సందర్భాల్లో శానిటేషన్ చేయాలన్నారు. మాస్కులు లేకుండా బస్సులోకి అనుమతించకూడదని సూచించారు. అనంతరం ప్రయాణికుల సౌకర్యార్థం కాగజ్ నగర్ క్రాస్ రోడ్ వద్ద నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుకు సంబంధించిన వివరాలను అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ మేనేజర్ దేవపాల సిబ్బంది పాల్గొన్నారు.

## కరోనా బారిన పడి మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**-తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తోట్ల మల్లేష్ యాదవ్**



మంచిర్యల, ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి:కరోనా బారిన పడి మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తోట్ల మల్లేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఒకేరోజు నలుగురు జర్నలిస్టు మరణించడం బాధాకరం అని అన్నారు. కరోనాతో మరణించిన జర్నలిస్టుల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల రక్షణ కొరకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రెండో దశ కరోనా వేగంగా విజృంభి స్తున్న తరుణంలో జర్నలి స్టులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ నుండి ఇరవై ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండి సేవలందిస్తున్న జర్నలిస్టును ఆదుకోవాలని జర్నలిస్టు లకు ప్రతినెల ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. కరోనా వ్యాధిని హెల్త్ కార్డులో చేర్చి ఆస్పత్రుల్లో జర్నలిస్టులకు ప్రత్యేక అవార్డులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## రెండు పడక గదుల ఇండ్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానం

**జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి**



మంచిర్యల, ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి:నిరుపేదలందరికి గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు పడక గదుల ఇండ్ల కోసం మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాల ప్రతులు జత చేసి మీ సేవా కేంద్రంలో మే 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వైద్యుడు రాజారమేష్ పుట్టిన రోజున రక్తదానం



క్యాతనపల్లి,ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి:మందమర్రి ఏరియా సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తూ కార్మికులకు వైద్యం అందిస్తూనే పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పట్టణ ప్రజలకు నేనున్నానంటూ స్పందించే వైద్యుడు రాజారమేష్ పుట్టిన రోజున పలువురు రక్తదానం చేశారు. వైద్యుడు రాజారమేష్ మాట్లాడుతూ మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకనాల భాస్కర్ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ వైద్యులు అజామొద్దీన్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు వైద్యులు రామ్మోహన్, ఉప్పలయ్యలతో పాటు మరో 17 మంది రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. ప్రతి ఒక్కరు సేవారంగంలో ముందుండాలని అన్నారు. రక్తదానం చేసిన వారికి పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంజిత్ కుమార్, రంగాచారి, గురుస్వామి, కన్నా, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటి పోలీసులో బాగంగా కరోనాతో యుద్ధంపై తీర్మానం



లక్షెటిపేట, ఏప్రిల్ 23, ప్రజాపాలన ప్రతినిధి:లక్షెట్టిపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో కరోణను అంతం చేసేందుకు కమ్యూనిటి పోలీసింగ్ లో బాగంగా రామగుండం కమీషనరేట్ సిపి సత్యానారాయణ, మంచిర్యాల డీసిపి ఉదయ్ కుమార్, ఏసిపి అఖిల్ మహజన్ గార్ల ఆదేశాల మేరకు సర్పంచ్ లతోపాటు పాలక వర్గం సభ్యులు, కార్మికులు తో లక్షెటిపేట సిఐ నారాయణ నాయక్ , ఎసై దత్తాత్రి అద్వర్యం లో శుక్రవారం జిపీల్లో తీర్మాణం చేసారు. గ్రామంలో ప్రతీ ఒక్కరూ మాస్కు ధరించాలని, ఎవరైనా ఇంటికి వస్తే మాస్కు ఉంటేనే ఇంటి లోనికి రానివ్వడం జరుగుతుందని, కొత్త వాళ్లు ఎవరైన గ్రామానికి వస్తే మాస్కు ధరించి ఉంటేనే గ్రామంలోకి అనుమతించడం జరుతుందని కార్యాలయాల్లో తీర్మాణం చేసారు. అంతే కాకుండా బౌతిక దూరం పాటిస్తు కోవిడ్ నిభందనలపై ప్రజలకు అవగాహన కూడా కల్పించడంలో పాలకవర్గం సిబ్బంది ముందడు గు వేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా మాస్కు ధరించకున్న నిభందనలు ఉల్లంగించిన పంచాయితీ నుండి వెయ్యి రూపాలయ జరిమానా విధించనున్నట్లు తీర్మాణం చేసారు. కరోణపై యుద్ధం చేసేందుకు పోలీసులకు అండగా ఉంటామని పోలీసుల సలహాలు సూచనలు పాటిస్తామని అన్ని గ్రామాల సర్పంచ్ లతోపాటు పాలకవర్గం సభ్యులు తీర్మాణంలో పేర్కొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | కొల్చారం | 9912532909 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| టి. సురేష్‌చారి | ఆసిఫాబాద్ | 9000983108 |
| అన్వర్ బాషా | కుత్బుల్లాపూర్ | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్ధిపేట | 6309723472 |


## మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రి పూలే విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలి వినతి పత్రం అందజేసిన మత్స్య కార్మిక సంఘం



ఇబ్రహీంపట్నం, ప్రజా పాలన ప్రతినిధి : - ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ లో మహాత్మ జ్యోతి రావు పూలే సావిత్రి బాయి పూలే విగ్రహాలకు స్థలం కేటాయించాలని ఇబ్రహీంపట్నం మత్యకారుల సంఘం తరఫున ఈరోజు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ జయంత్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరింకల నరసింహ మాట్లాడుతూ మహనీయులను మరువద్దని వారిని ఎప్పటికీ స్మరించుకోవాలని మహాత్మ జ్యోతిరావు పూలే ఆయన అడుగుజాడల్లో మనం నడవాలి అంటూ ఆయనను అనుక్షణం స్మరించుకునే ఎందుకు ఇబ్రహీంపట్నం నుండి హైదరాబాద్ కి వెళ్లే దారిలో భాస్కర్ హొటల్ పక్కన 400 గజాల స్థలం కేటాయించాలని కోరారు ఈ కార్యక్రమంలో చెన్న మౌని శంకర్ అన్న మౌని రాఘవేంద్ర అడ్వకేట్ అరుణ్ కుమార్ జేరుకొని రాజు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ వాణిజ్య యుద్ధం....

చమురు దిగుమతి చేసుకొనే దేశంగా ఉన్న అమెరికా ఇటీవలి కాలంలో షేల్ ఆయిల్ ఉత్పత్తి కారణంగా చమురు ఎగుమతి దేశంగా మారిపోయింది. అమెరికాతో మన వాణిజ్యం కొద్దిగా మిగులులో ఉంది. కనుక తమ కంపెనీల నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు, ఆయుధాలతో పాటు చమురు కూడా కొంటా రా లేదా అని అది వత్తిడి చేస్తోంది. పశ్చిమాసియా, గల్ఫ్ దేశాలు మనకు ఎప్పుడూ మిత్రులుగానే ఉన్నాయి తప్ప శత్రువులు కాదు. గల్ఫ్ దేశాల నుంచి కొనుగోళ్లు తగ్గించి ఆమేరకు అమెరికా చమురు కొనాలంటే ఏదో ఒకసాకు కావాలి. సౌదీ అరేబియా ఇటీవల చమురు ఉత్పత్తిని తగ్గించిన కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగాయి. తగ్గినపుడు ఆ మేరకు మన జనానికి తగ్గించకుండా పన్నులు వేసి ఆ మొత్తాలను అదానీ, అంబానీల వంటి కార్పొరేట్లకు పన్నుల రాయితీల రూపంలో మూటగట్టి మరీ ఇచ్చారు, ఇస్తున్నారు. ఇప్పుడు చమురు ధరలు పెరిగితే ప్రస్తుతం నరేంద్ర మోడీ మత్తులో ఉన్న జనానికి అది వదిలిన తరువాత ఏం జరుగుతుందో అందరి కంటే నరేంద్ర మోడీకే బాగా తెలుసు గనుక చమురు ఎగుమతి దేశాల మీద రుసరుసలాడుతున్నారు. మా దగ్గర కారుచవకగా కొన్న చమురు ఉంది కదా ఆమేరకు మీ వినియోగదారులకు భారం తగ్గించండి అని సౌదీ అరేబియా సలహాయిచ్చింది. దాన్ని సాకుగా తీసుకొని వేరే మార్కెట్లలో కొనుగోలు చేయాలని మన చమురు కంపెనీలను కోరారు. పోనీ ఆ వేరే మార్కెట్లలో మన లావు పాత పోలిక వద్దు లెండి ఇప్పుడు గడ్డం పొడవు చూసి అనాలేమో ! తక్కువ ధరలకు ఏమైనా ఇస్తాయా ? ఒక్క సెంటు(మన ఏడు పైసలకు సమానం) కూడా తగ్గించవు. అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ధరల ప్రకారమే, డాలర్లు మరీ చెల్లించి మనం కొనుక్కోవాలి, మన పొరుగునే ఉన్న గల్ఫ్ నుంచి రవాణా ఖర్చులు తక్కువ, అదే అమెరికా నుంచి కొనుగోలు చేస్తే తడచిమోపెడంత అవుతాయి? తనది కాదు గనుక తాటిపట్ట వేసి గోక్కోమన్నాడట వెనుకటికెవడో ! అలాగే కేంద్ర పెద్దలదేముంది, భరించేది మనమే కదా ఎంతైనా, ఎక్కడి నుంచైనా తెస్తారు? చమురు కార్పొరేట్లతో వారి సంబంధాలు ముఖ్యం కదా !మన ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా స్నేహం పట్టినప్పటి నుంచీ కొంత చమురును మన రూపాయల్లో కొనే వెసులుబాటు కల్పించిన ఇరాన్‌ను వదలిపెట్టి అమెరికన్లను మెప్పించేందుకు చమురు కొనుగోళ్లను ఎలా పెంచారో తెలుసా? 2017–18లో రోజుకు 38 వేల పీపాల చమురు అమెరికా నుంచి దిగుమతి చేసుకున్నాము. 2021 ఫిబ్రవరిలో ఆ మొత్తం 5,45,300 పీపాలకు పెరిగింది. ప్రస్తుతం 8,67,500 పీపాలతో మొదటి స్ధానం లో ఉన్న ఇరాక్ నుంచి దిగుమతులను గణనీయంగా తగ్గించి అమెరికా మీద అధికంగా ఆధారపడే విధంగా మోడీ వేగంగా ప్రయాణిస్తున్నారు. మన పశ్చిమాసియా మిత్ర దేశాలతో చమురు వైరుధ్యం తెచ్చుకొని ఆ దారులన్నీ మూసుకున్న తరువాత అమెరికా ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చోవాలి, ఎక్కడ, ఎలా నిలబడమంటే అలా నిలబడాల్సిన రోజు వచ్చినా ఆశ్చర్యం లేదు. మన చమురు ఆయుధాన్ని మన మీదే ప్రయోగిస్తే చేయగలిగిందేమీ లేదు విదేశాలకు చెందిన సంస్థలు మన దేశంలో డిజిటల్ సేవలను అందించి వ్యాపారం చేస్తున్నపుడు దానికిగాను డిజిటల్ సర్వీసు టాక్సు(డిఎస్‌టి) చెల్లించాలని మన దేశం 2016లోనే అనేక దేశాలతో పాటు ఆదాయం మీద ఆరు శాతం పన్ను విధించాలని నిర్ణయించింది. అయితే అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల వత్తిడి మేరకు మోడీ సర్కార్ దాన్ని ఆన్‌లైన్ ప్రకటనల సేవలకు మాత్రమే పరిమితం చేసింది. తరువాత అన్ని రకాల డిజిటల్ సేవలకు గాను రెండు శాతం చెల్లించాలని గత ఏడాది మార్చి నెలలో 2020 ఫైనాన్స్ చట్టం ద్వారా నిర్ణయించింది. అలాంటి సేవలందించే సంస్థలలో అత్యధిక భాగం అమెరికాకు చెందినవే. మన దేశం విధించిన పన్ను పరిధిలోకి వివిధ దేశాలకు చెందిన 119 సంస్థలు వస్తాయి, వీటిలో కేవలం అమెరికా నుంచే 86 ఉన్నాయి. ఈ పన్ను అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం, అమెరికా వాణిజ్య సంస్థల పట్ల వివక్ష చూపటమే అని అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచ వ్యాపితంగా డిజిటల్ ఆర్ధిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దశలో ఏ దేశమూ దాని ద్వారా రావాల్సిన ఆదాయాన్ని వదులుకోజాలదు. మన దేశ వినియోగదారులతో విదేశీయులు జరిపే ప్రతిలావాదేవీకి ఈ పన్ను వర్తిస్తుంది.. 1974 వారు చేసిన అమెరికా వాణిజ్య చట్టంలోని 301 సెక్షన్ ప్రకారం ఏ దేశమైనా అమెరికా వాణిజ్యానికి వ్యతిరేకమైన చర్యలు తీసుకున్నదని భావిస్తే తమ స్వంత చట్టం ద్వారా విచారణ జరుపుతారట. ఆ మేరకు చర్యలు కూడా తీసుకుంటారు. మన దేశం విధించిన డిఎస్‌టి అమెరికా, తదితర విదేశీ డిజిటల్ సంస్ధలకు మాత్రమే వర్తింపచేస్తూ భారతీయ సంస్థలకు మినహాయింపు ఇవ్వటం వివక్ష కిందకు వస్తుందన్నది ఒక అభ్యంతరం. ఉదా? అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్ వంటి వాటితో పాటు అంబానీ, అదానీ కంపెనీలు డిజిటల్ సేవలు అందించినా ఈ చట్టం ప్రకారం అదానీ, అంబానీలు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. రెండవది కొన్ని నాన్ డిజిటల్ సేవా సంస్థలు డిజిటల్ సేవల మాదిరి వాటిని అందచేసినా వాటికి మినహాయింపు ఇవ్వటం వివక్షాపూరితం అన్నది అమెరికా అభ్యంతరం. దీన్ని మన దేశం అంగీకరించలేదు. ఏ కంపెనీ అయినా మన దేశంలో శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే దానికి మన దేశంలోని పన్ను చట్టాలు వర్తిస్తాయి. గనుక వాటి మీద మరొక పన్ను విధించాల్సిన అవసరం లేదన్నది మన వాదన. అమెరికా సంస్థలు ఏవైనా మన దేశంలో శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే అదే సూత్రం వర్తిస్తుంది. ఎలాంటి పన్నులు చెల్లించకుండా మన సేవల ద్వారా లాభాలు పొంది వాటిని తమ దేశాలకు తరలించుకుపోవాలన్నది విదేశీ కార్పొరేట్ శక్తుల ఎత్తుగడ. చైనా, భారత్ వంటి దేశాలలో పెద్ద ఎత్తున డిజిటల్ సేవలను విస్తరిస్తున్నందున వాటి నుంచి పన్ను ఆదాయం రాబట్టకుండా ఆర్ధిక వ్యవస్థలు నడవవు. అనేక దేశాలు వివిధ రూపాలలో వస్తు, సేవల మీద పన్నులు వసూలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు చైనాలో డిఎస్‌టి లేదు. చైనాకు చెందిన అలీబాబా వంటి సంస్థలు డిజిటల్ సేవలు అందిస్తున్నాయి. చైనాలో ప్రస్తుతం 18 రకాల పన్నులు ఉన్నాయి. డిజిటల్ సేవల మీద కూడా పన్ను విధించాలనే ఆలోచన చేస్తున్నారు. అక్కడ కూడా అమలు చేస్తే ప్రస్తుతం సాగుతున్న వస్తు, సేవల వాణిజ్య యుద్ధం డిజిటల్ సేవల వాణిజ్యానికి కూడా విస్తరించవచ్చు. మన దేశం విధించిన 2% డిఎస్‌టికి ప్రతిగా కొన్ని భారతీయ వస్తువులపై 25 శాతం దిగుమతి పన్ను విధించి బదులు తీర్చుకుంటామని మార్చి నెల చివరి వారంలో అమెరికా నూతన వాణిజ్య ప్రతినిధి కాథరీన్ తాయి బెదిరించారు. ఆస్ట్రియా, బ్రిటన్, ఇటలీ, టర్కీ, స్పెయిన్, ఇతర దేశాల మీద కూడా బస్తీమే సవాల్ అన్నారు. మన ఎగుమతులకు ఇచ్చే రాయితీలను కొన్నింటిని ట్రంప్ రద్దు చేసిన విషయం తెలిసిందే. అప్పుడు ఉన్నవి పోయాయి, ఇప్పుడు కొత్తవి తగులుకుంటాయి. అయితే అమెరికా చర్యలకు ప్రతీకారంగా అమెరికాను ప్రపంచ వాణిజ్య సంస్థ కోర్టులోకి లాగవచ్చు. అమెరికా నుంచి వస్తున్న ఆడియో, వీడియో ప్రసారాల మీద పన్ను వేయవచ్చు, అమెరికా క్రెడిట్ కార్డు కంపెనీలు, మెసేజింగ్ సేవలను నిలిపివేయవచ్చు. ఆ చర్యలు తీసుకొనే దమ్మూ ధైర్యం మన 56 అంగుళాల ప్రధానికి ఉందా ? బహుశా మరొక పద్ధతిలో బైడెన్‌న్ను ప్రసన్నం చేసుకొనేందుకు సౌదీ బదులు మరింతగా అమెరికా నుంచి చమురు కొంటామనే సంకేతం పంపారా? అమెరికా వాణిజ్య ప్రతినిధి కాథరీన్ తాయి బెదిరింపు ఈ సంకేతం ఒకే సమయంలో వెలువడటాన్ని ఎలా అర్ధం చేసుకోవాలి?

## జడ్చర్ల మున్సిపాల్టీ లెక్కలు ఏంటీ..?

మహబూబ్ నగర్, ఏప్రిల్ 23, :ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జడ్చర్ల మున్సిపాలిటీ ఎన్నికలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆ మున్సిపాలిటీలో ఎన్నికలు పార్టీల మధ్య పోరులా కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య వార్‌లా మారాయి. పురపోరును రియల్ ఎస్టేట్ వ్యాపారులు శాసిస్తున్నారు. అన్ని వార్డుల్లో వారి జోరే కొనసాగుతోంది. ప్రధాన పార్టీలు సైతం వారినే నమ్ముకున్నాయి. ఇక రిజర్వేషన్లు అనుకూలించని చోట.. వెనకుండి రాజకీయాలు నడిపిస్తున్నారు. గెలిచేది ఎవరైనా జడ్చర్లలో రియాల్టర్ల అజెండానే అమలవుతుందనే చర్చ జోరందుకుంది. జడ్చర్ల మున్సిపాలిటీకి కోర్టు కేసులు, విలీన గ్రామాల రగడ కారణంగా కొన్నాళ్లు ఎన్నికలు జరగలేదు. పదేళ్ల గ్యాప్ తర్వాత ఎన్నికల నగారా మోగింది. దీంతో అన్ని పార్టీలు పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఛైర్ పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో రియాల్టర్లు వెనకుండి చక్రం తిప్పుతున్నారని అనుకోవడానికి లేదు. మున్సిపాలిటీలోని 27 వార్డుల్లో ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్నవారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఎక్కువ. పార్టీ టికెట్ రాకపోతే ఇండిపెండెంట్‌లుగా బరిలో దిగిన వారూ ఉన్నారు. ప్రస్తుతం వార్డుల్లో ప్రచారానికి డబ్బును నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఎన్నికలను మించి డబ్బు బయటకు తీస్తున్నారట. కౌన్సిలర్‌గా గెలిస్తే వ్యాపార విస్తరణ చేసుకోవచ్చని.. భవిష్యత్ రాజకీయానికి బాటలు వేసుకోవచ్చని చాలా మంది భావిస్తున్నారట. బెంగళూరు హైవేకు ఆనుకుని జడ్చర్ల ఉండటంతో.. రియల్ భూమ్‌ను పెంచి క్యాష్ చేసుకోవడానికి చాలా మంది కన్నేశారు. అలాగే ఇక్కడ భూమి తగాదాలు ఎక్కువే. పవర్ చేతిలో ఉంటే ఇలాటి సమస్యలను చక్కబెట్టుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారట బరిలో ఉన్న అభ్యర్థులు. అందుకే ఖర్చుకు వెనకాడటం లేదని సమాచారం. టీఆర్‌ఎస్ బీఫాం ఇస్తుందని చాలా మంది వ్యాపారులు ఆశించారు. ప్రతి వార్డు నుంచి పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. అధికారపార్టీ అయితే గెలుపు సునాయాసమని భావించారు. పార్టీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత టికెట్లు రానివారు వెనక్కి తగ్గడానికి ఇష్టపడటం లేదట. దీంతో జడ్చర్ల టీఆర్‌ఎస్‌లో కొత్త పంచాయితీ మొదలైందిబరిలో ఉన్నవారంతా రియల్ ఎస్టేట్ వ్యాపారులే కావడంతో.. గెలిచే వరకు కుస్తీ పట్టి.. గెలిచాక పార్టీలకు అతీతంగా దోస్తీ చేయవచ్చని కామెంట్స్ వినిపిస్తున్నాయి. అసలు సమస్యలు పక్కకెళ్లి.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల మదిలో ఉన్న ఆలోచనలే మెయిన్ అజెండా అవుతాయని అనుమానిస్తున్నారట.




## కోవిడ్ సెకండ్ వేవ్ ని ఎదుర్కొనుటకు నిర్దేశించిన వ్యూహాలు

మనకు న్యుమోనియా సోకినది లేనిది అనేది ఈ పరీక్ష పాజిటివ్ గా నిర్ధారించబడినా 3 వ రోజు నుండి 6 వ రోజు లోపు నడక పరీక్ష నిర్వహించినపుడు ఫలితాలు ఆశాజనకముగా ఉంటాయి. మొదటగా నడక ప్రారంభానికి ముందు మన రక్తం లో ఉన్న ఆక్సిజన్ శాతం ఎంతో గుర్తించాలి. తరువాత సదరు వ్యక్తి ఆగకుండా 6 నిముషాలు పాటు నడవాలి. నడక పూర్తయ్యాక మరలా రక్తం లో ఉన్న ఆక్సిజన్ శాతం ఎంతో కొలవాలి. నడక ముందు ఉన్న శాతానికి 5 శాతం కంటే తగ్గితే అతని ఊపిరితిత్తులలో అంతర్గతముగా న్యుమోనియా అభివృద్ధి చెందుచున్నదని భావించి సదరు వ్యక్తిని వెంటనే హాస్పిటల్ కు తరలించాలి. కోవిడ్ పట్ల ఉన్న అజాగ్రత్తత మనస్తత్వమును మరియు మొండి వైఖరిని ప్రతి ఒక్కరూ మార్చుకోవాలి. ఇది వేగముగా వ్యాప్తి చెందుతున్నందున యుద్ధ ప్రాధిపకతన తగిన చర్యలు అమలు చేయడం అనేది అత్యవసరము. మాస్కులు సరిగా ధరించని, కోవిడ్ నియమ నిబంధనలు సరిగా పాటించని వ్యక్తుల పట్ల కఠినముగా వ్యవహరించాలి. మాస్క్ ధరించేటప్పుడు తొలగించే సందర్భాల్లో జాగ్రత్త వహిస్తూ తగిన నైపుణ్యాన్ని ప్రదర్శించాలి. ఏదేనా పనిచేసే ముందు మీరు చేసే ఆ పని కరోనా ను నిరోదిస్తుందో లేక పెంచిపోషిస్తుందో అని ఒకసారి ఆలోచించండి. పబ్లిక్ మరియు ప్రభుత్వ సిబ్బందితో స్నేహపూర్వకముగా వ్యవహరించండి మరియు వారికి సహకరించండి. కోవిడ్ నిబంధనలు పాటించడములో 100 శాతం వాటికి కట్టుబడి ఉండండి. వైరస్ ప్రభావాన్ని అర్థం చేసుకుని తదనుగుణంగా అప్రమత్తతతో వ్యవహరించండి. టెస్టింగ్, ట్రేసింగ్, ఐసోలేటింగ్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలలో 18 నుండి 45 సంవత్సరాల వయసు ఉన్నవారిని చేర్చడం. ప్రభుత్వము సూచించిన విధముగా టీకా కోర్స్ ను పూర్తి చేయండి.

జంగ్ ఫుడ్ మరియు బయట తినడం పూర్తిగా మానుకోండి. పోషకవిలువలు తో కూడిన అఃహారముతో పాటు పళ్ల రసాలు మరియు తాజా కొబ్బరి నీరు తరచుగా తీసుకొనండి. జనాభాలో ఉన్న 70 శాతం ప్రజలు పూర్తి వ్యాక్సినేషన్ పొందే వరకూ ఇలాంటి వేవ్ లు అనేవి వస్తూనే ఉంటాయి కాబట్టి ప్రజలందరూ పూర్తిగా వ్యాధి నిరోధ కత శక్తి పొందే వరకూ మాస్కును వినియోగించడమే అనేది మానకూడదు. ఊబకాయం, బీపీ, షుగరు వంటి అనారోగ్యాలతో బాధపడే వారు మరింత జాగ్రత్తతో ఉండాలి. ఈ సెకండ్ వేవ్ లో అధిక శ్రమ, వ్యాయామము అనేది అవసరము లేదు. రోజు వారి దినచర్యలో ప్రాణాయామం మరియు యోగా చేర్చండి. ఈ సెకండ్ వేవ్ అనేది 100 రోజుల వరకూ ఉంటుంది.

మనకు టీకా ఎందుకు అవసరము?

ప్రభుత్వము నిర్దేశించిన విధముగా 2 డోసుల టీకా పొందిన చాలా మంది వ్యక్తులు సైతం కరోనా వ్యాధితో ఆసుపత్రులయందు చేరుతున్నారు. అటువంటి వారందరికీ పరీక్షలు నిర్వహించా క అధిక సందర్భాలలో గమనించిన విషయము ఏమిటంటే వీరంతా అధిక %జు% వాల్యు కలిగి ఉండి(%జు% వాల్యు తక్కువ నమోదు అయితే అధిక ప్రమాదము), తక్కువ వైరస్ ఇన్ఫెక్షన్ తో పాటు తేలికపాటి లేదా మితమైన వ్యాధి లక్షణాలతో పాటు వీరి ద్వారా వ్యాధి ప్రసార సామర్థ్యము అనేది చాలా తక్కువతో కలిగి ఉంటారని గమనించడం జరిగింది.

కాబట్టి అవకాశం ఉన్న ప్రతి వారు ప్రభుత్వము సూచించిన విధముగా ఈ రోజే టీకా వేయించుకోండి, భాద్యతతో కోవిడ్ మరణాలను నిరోధించండి.

**డాక్టర్ శ్రీకాంత్ ఆర్జా**
**ఏపీ స్టేట్ కోవిడ్ నోడల్ అధికారి**

# మార్కెట్ లో 700 పైనే వ్యాక్సిన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23, :డవ దశ కరోనా వైరస్ వ్యాప్తిని, తీవ్రతను అరికట్టేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్న కేంద్రం వ్యాక్సిన్ లభ్యతను పెంచడం ద్వారా పరిస్థితిని సాధ్యమైనంత త్వరగా అదుపులోకి తెచ్చేందుకు ముమ్మర చర్యలు చేపట్టింది. ముఖ్యంగా డిమాండుకు సరిపడా పరిమాణంలో వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడం వల్ల, ఆక్సిజన్ కొరత కారణంగా కూడా మందుల రేట్లు పెరగడం, ప్రాణవాయువు అందరికీ అందుబాటులోకి రాకపోవడం జరుగుతోంది. అయితే ఇతర దేశాలకు ఎగుమతులు ఆపి దేశీయంగానే వ్యాక్సిన్ డోసులను అందుబాటులోకి తెస్తున్న ప్రభుత్వం దాని డోసు రేటును కూడా నిర్ణయించినట్లుగా స్పష్టమవుతోంది. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ మే 1 తేదీ నుంచి టీకాలు వేయాలని నిర్ణయించిన కేంద్రం ఒక్కో డోసు రేటును 250 రూపాయలుగా నిర్ధారించినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యాక్సిన్ డోసులు ప్రైవేటు మార్కెట్ లోకి వచ్చే నాటికి వీటి రేటు 700 నుంచి 1000 రూపాయల పైనే ఉండవచ్చునని మీడియా కథనాల వల్ల స్పష్టమవుతోంది. దేశీయ సరఫరాలు సరిపోకపోవడం వల్ల విదేశాల నుంచే వీటిని దిగుమతి చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కోవిషీల్డ్ రేటు ప్రైవేటు మార్కెట్ లో డోసుకు వేయి రూపాయల పైనే ఉండవచ్చునని, అలాగే డాక్టర్ రెడ్డీస్ సంస్థ రష్యా నుంచి దిగుమతి చేసుకోబోయే స్పుత్నిక్ రేటు కూడా 750 రూపాయలకు పైనే ఉండవచ్చునని తెలుస్తోంది. వీటి ధరల విషయంలో అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోయినా అంతిమంగా దేశీయ మార్కెట్ లోకి ఇవి వచ్చే సమయానికి 750 నుంచి 1000 రూపాయల మధ్యే డోసు రేటు ఉంటుందని అంచనా. అయితే మార్కెట్ లో డిమాండ్ అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ పరిమాణం, ఎగుమతి పరమైన అంశాలు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకొని మాత్రమే తాము అంతిమంగా వ్యాక్సిన్ రేటును నిర్ణయించ గలుగుతామన్నది ఆయా కంపెనీల వాదన. అయితే ప్రస్తుతం కోవిడ్ వైరస్ అన్నది ప్రాణాంతక మహమ్మారిగా మారింది కాబట్టి ప్రభుత్వం నిర్ణయించే రేటుకు అనుగుణంగానే ఈ కంపెనీలు వ్యాక్సిన్ ధరను నిర్ణయించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం నిర్ణయించిన రేటు తమకు ఏ మాత్రం వాస్తవికం కాదు కాబట్టి మార్కెట్లో నిలబడేందుకు వీలుగానే సముచితమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం డోసుకు 150 రూపాయల చొప్పున ప్రభుత్వం ఈ వ్యాక్సిన్ ను సేకరిస్తోంది. అయితే ఇది ఏ మాత్రం తమకు యోగ్యమైనది కాదని ప్రభుత్వం కూడా అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని వ్యాక్సిన్ సేకరణ ధరను నిర్ణయించాలని చెబుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు సంస్థలకు ఎంత పరిమాణంలో ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి తేవాలి? రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంతమేరకు వీటిని అందించాలన్నది కూడా పరిగణన లోకి తీసుకోవలసిన అంశాలు కాబట్టి వ్యాక్సిన్ రేటు కూడా పోటీ యోగ్యంగా ఉండాలన్నది ఈ కంపెనీల వాదన. ఇప్పటికే వ్యాక్సిన్ తయారీ విషయంలో పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టాయి. ఎంత ప్రాణావసర మందైనా కూడా పెట్టుబడి నష్టాన్ని ఏ కంపెనీ భరించలేదు. ప్రైవేటు అమ్మకాలు, ఎగుమతుల ద్వారా లాభాలను ఆర్జించేందుకే ప్రయత్నిస్తుంది. దేశీయంగా ఎంత మేరకు కోవిడ్ వ్యాక్సిన్




అందుబాటులో ఉంది డిమాండు తట్టుకోవడానికి ఎంత మేరకు దిగుమతులు చేసుకోవాల్సి ఉంటుంది అన్న అంశాలపై కూడా ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. 18 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ అనివార్యం కానున్న దృష్ట్యా ధారగాలా శరాఘాతానికి అమాయకులు బలికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఎంత ఉంటుందో ప్రైవేటు కంపెనీలపై కూడా అంతే ఉంటుంది.



## మరో మైలురాయిని చేరుకున్న 'సారంగ దరియా'




యువసామ్రాట్ నాగ చైతన్య – సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన ప్రేమకథా చిత్రం "లవ్ స్టోరీ". ఏప్రిల్ 16న విడుదల కావాల్సిన ఈ సినిమా కోవిడ్ నేపథ్యంలో వాయిదా పడింది. అయితే ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు విడుదలైన ప్రతీ పాట కూడా విశేష స్పందన తెచ్చుకుంది. ముఖ్యంగా 'సారంగ దరియా' పాట యూట్యూబ్ ను షేక్ చేస్తూ సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఆదిత్య మ్యూజిక్ లేబుల్ ద్వారా రిలీజైన ఈ సాంగ్ కేవలం 32 రోజుల్లోనే 100 మిలియన్ వ్యూస్ మార్క్ అందుకొని సౌత్ ఇండియాలో అతి తక్కువ టైంలో ఈ ఫీట్ అందుకున్న సాంగ్ గా నిలిచింది. ఈ క్రమంలో 'సారంగ దరియా' పాట యూట్యూబ్ లో 15 కోట్లకు పైగా వ్యూస్ సాధించి తాజాగా 150 మిలియన్ల క్లబ్ లో జాయిన్ అయింది. తెలంగాణ జానపదం నేపథ్యంలో సాగిన ఈ పాట సంగీత ప్రియులను అలరిస్తూ 50 రోజుల్లోనే 150 మిలియన్లకు పైగా వ్యూస్ రాబట్టడం విశేషం. 'దాని కుడీ భుజం మీద కడవా.. దాని గుత్తెపు రైకలు మెరియా.. అది రమ్మంటె రాదురా సెలియా.. దాని పేరే సారంగ దరియా..' అంటూ సాగిన ఈ గీతానికి మ్యూజిక్ డైరెక్టర్ పవన్ సీహెచ్ అద్భుతమైన ట్యూన్ స్వరపరిచారు. 'కాళ్ళకు ఎండీ గజ్జెల్.. లేకున్నా నడిస్తే ఘల్ ఘల్.. కొప్పులో మల్లే దండల్.. లేకున్నా చెక్కిలి గిల్ గిల్.. నవ్వుల లేవుర ముత్యాల్.. అది నవ్వితే వస్తాయ్ మురిపాల్..' అంటూ ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ అందించిన తెలంగాణ జానపద సాహిత్యం దీనికి అదనపు ఆకర్షణగా నిలిచింది. అలానే జానపద గాయని మంగ్లీ పాడిన తీరు శ్రోతలను విశేషంగా ఆకట్టుకుందని చెప్పవచ్చు. ఇందులో సాయి పల్లవి స్టెప్స్ వీక్షకులను అలరించాయి. ఇకపోతే 'సారంగ దరియా' పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేయగా.. విజయ్ సి.కుమార్ సినిమాటోగ్రఫీ అందించారు. 'లవ్ స్టోరీ' చిత్రాన్ని వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్పీ మరియు అమిగోస్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.

## మెగాహీరో బ్లాక్ బస్టర్ సీక్వెల్ చేయనున్నాడా..??

టాలీవుడ్ మెగాపవర్ స్టార్ రాంచరణ్ తేజ్ ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమా ఆర్ఆర్ఆర్ లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ టైం రాంచరణ్ ఓ ఫ్రీడమ్ ఫైటర్ పాత్రలో నటిస్తున్నాడు. అలాగే ఆర్ఆర్ఆర్ సినిమాతోనే రాంచరణ్ పాన్ ఇండియా హీరోగా పరిచయం కాబోతున్నాడు. రాజమౌళితో ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత రాంచరణ్ క్రియేటివ్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో మరో పాన్ ఇండియా సినిమా చేయనున్నాడు. ఇప్పటికే వీరి కాంబినేషన్ పై అధికారిక ప్రకటన వచ్చేసింది. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్ పైకి వెళ్ళనుంది. డైరెక్టర్ శంకర్ తో సినిమా రాంచరణ్ కెరీర్లో 15వది. అయితే ఆ సినిమా మొదలు కాకముందే రాంచరణ్ 16వ సినిమా గురించి సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. ఆ సినిమా కూడా రాంచరణ్ నటించిన బ్లాక్ బస్టర్ రంగస్థలం సినిమాకు సీక్వెల్ అని తెలుస్తుంది. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో రాంచరణ్ మరో సినిమా ప్లాన్ జరుగుతుందని ఇండస్ట్రీలో టాక్ నడుస్తుంది. ప్రస్తుతం సుకుమార్ అల్లు అర్జున్ తో పుష్ప అనే పాన్



ఇండియా సినిమా చేస్తున్నాడు. ఆ తర్వాత రౌడీహీరో విజయ్ దేవరకొండతో ఓ సినిమా చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించాడు. అయితే ఈ రెండు సినిమాల తర్వాత సుక్కు – రాంచరణ్ కాంబో మూవీ పట్టాలెక్కుతుందని టాక్. దీని పై క్లారిటీ వస్తుందేమో చూడాలి.

## మరోసారి మనసు చాటుకున్న యువహీరో!

ప్రస్తుతం దేశం మొత్తాన్ని కరోనా మహమ్మారి పీడిస్తోంది. సామాన్యులు మొదలుకొని సెలబ్రిటీలు బడా రాజకీయనేతలు కూడా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నా కరోనా మాత్రం ఎవరిని వదలడం లేదు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ఈ మహమ్మారిని ప్రభుత్వాలు కూడా కంట్రోల్ చేయలేకపోతున్నాయి. అయితే రోజురోజుకి లక్షల్లో కేసులు వేలసంఖ్యలో మరణాలు నమోదు అవుతుండటంతో జనాలు అసలు స్వేచ్ఛగా ఊపిరి కూడా కూడా తీసుకోలేకపోతున్నారు. ఇలాంటి సమయంలో చాలామంది పేదలు కరోనా బారినపడి వైద్యానికి ఆర్థికస్థోమత లేక నిరుత్సాహంగా జీవితాలను వదులుకుంటున్నారు. కానీ కొందరు మాత్రమే ధైర్యం చేసి సహకారం అడుగుతున్నారు. తాజాగా టాలీవుడ్ యువహీరో ఓ కరోనా పేషెంట్ కు




మందులు పంపించి సహాయం అందించాడు. నిజానికి ప్రస్తుతం దేశంలో కరోనా వాక్సిన్స్ కొరత కూడా ఉంది. ఇలాంటి సమయంలో.. ఓ యువకుడు కరోనా బారినపడి మందులు లేక అవస్థలు పడుతున్న తన తండ్రికి రెమిడిసివర్ డోసులు ఇప్పించగలరని హీరో నిఖిల్ ను ట్విట్టర్ వేదికగా సహాయం కోరాడు. దీనిపై వెంటనే స్పందించిన హీరో నిఖిల్.. ఆ యువకుడికి భరోసా ఇచ్చాడు. 'సిరివూరి రాజేష్ వర్మ మీకు అవసరమైన రెమిడిసివర్ దోసలతో మిమ్మల్ని కలుస్తాడు. మీ నాన్నగారికి త్వరగా నయం అవుతుందని కోరుతున్నాను'' అంటూ బదులిచ్చి భరోసా కల్పించాడు. హీరో నిఖిల్ చేసిన పనికి సోషల్ మీడియాలో కొనియాడుతున్నారు నెటిజన్లు అభిమానులు. ప్రస్తుతం ఈ హీరో కార్తికేయ సీక్వెల్ మూవీలో నటిస్తున్నాడు.

## మరోసారి తెరపైకి బ్లాక్ బస్టర్ కాంబో..!

సౌత్ ఇండియన్ టాలెంటెడ్ యాక్టర్ సినిమాకు గాను నేషనల్ అవార్డు కోలీవుడ్ హీరోగా మాత్రమే కాకుండా బాలీవుడ్ ప్రేక్షకులకు కూడా ధనుష్ రఘువరన్ బీటెక్ సినిమాతో క్రియేట్ చేసుకున్నాడు. అప్పటినుండి తమిళ సినిమాలన్ని తెలుగులో కూడా డబ్ తాజాగా ధనుష్ కర్ణన్ అనే సినిమాలో ఇటీవలే విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ చేతినిండా సినిమాలతో బిజీగా ఉ హ్యాపీగా ఉన్నాడు. ఓవైపు నేషనల్ అవార్డు



ధనుష్ ఈ ఏడాది 'అసురన్' అందుకున్న సంగతి తెలిసిందే. ధనుష్ ఇటు తెలుగు అటు దగ్గరవుతున్నాడు. ఆల్రెడీ తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ వరుసగా ధనుష్ నటిస్తున్న వెర్షన్ రిలీజ్ అవుతుంటాయి. నటించాడు. ఈ సినిమా అందుకుంది. అసలే న్నటువంటి హీరో డబుల్ దక్కిన ఆనందం మరోవైపు కర్ణన్ బ్లాక్ బస్టర్. ఈ డబుల్ ఆనందంతో తాజాగా మరో కొత్త సినిమాను అనౌన్స్ చేసాడు ధనుష్. కర్ణన్ సినిమా డైరెక్టర్ మారి సెల్వరాజ్ దర్శకత్వంలోనే మరో సినిమా చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. 'కర్ణన్ బ్లాక్ బస్టర్ తర్వాత నేను మారి సెల్వరాజ్ మరోసారి కలిసి మరో సినిమా చేయబోతున్నాం. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. వచ్చే ఏడాది షూట్ ప్రారంభం అవుతుందని చెప్పడానికి చాలా అనందంగా ఉంది' అంటూ ధనుష్ ట్విట్టర్ లో పోస్ట్ చేసాడు. ఈ విషయం తెలిసి ధనుష్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ధనుష్ ప్రస్తుతం ఆత్రంగిరే కార్తీక్ నరేన్ సెల్వరాఘవన్ సినిమాలతో బిజీగా ఉన్నాడు.

## దిల్ రాజుకు డైరక్టర్ కావలెను



అదేంటి తెలుగు ఇండస్ట్రీలో టాప్ ప్రొడ్యూసర్ గా వెలుగుతున్న దిల్ రాజుకు డైరక్టర్స్ దొరకకపోవటం ఏమిటి అని ఆశ్చర్యపోతున్నారా. ఒక్కోసారి అంతే..ఎంతో మంది సక్సెస్ ఫుల్ డైరక్టర్స్ ని పరిచయం చేసిన దిల్ రాజు ఇప్పుడు ఓ డైరక్టర్ కావాలి అని అన్వేషిస్తున్నారని ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం. ఇంతకీ ఏ హీరోని డైరక్ట్ చేయటానికి అంటారా..పవన్ కళ్యాణ్ ని. ఆశ్చర్యపోకండి...అసలు కథ చదవండి.పవన్ కళ్యాణ్ తో రీసెంట్ గా వకీల్ సాబ్ తో సూపర్ హిట్ ఇచ్చారు దిల్ రాజు. సెకండ్ వీక్ నుంచి సెకండ్ వేవ్ కరోనా తో థియోటర్స్ లో కలెక్షన్స్ డ్రాప్ అయ్యినా అప్పటికే మంచి లాభాల్లో ఉన్నారట ఆయన. ఫస్ట్ వీక్ లోనే చాలా భాగం రికవరీ ఉందిట. అలాగే డిజిటల్ రైట్స్ శాటిలైట్ రైట్స్ వంటి వాటితో సినిమా మంచి లాభాలు వచ్చాయట. ఈ నేపధ్యంలో ఆయన వెంటనే పవన్ కళ్యాణ్ తో మరో సినిమా చెయ్యాలనుకుంటన్నారట. పవన్ కు కూడా దిల్ రాజు ప్రొడక్షన్ ప్రమోషన్ అన్ని నచ్చాయట. దాంతో మరో సినిమాకు ఓకే అన్నారట. అంతా బాగానే ఉంది. కానీ డైరక్టర్ ఏడి. కథ ఏది..అప్పుడంటే పింక్ రీమేక్ దొరికింది.వేణు శ్రీరామ్ చక్కగా హ్యాండిల్ చేసాడు. ఈ సారి మళ్లీ రీమేక్ చెయ్యాలా లేక డైరక్ట్ కథ చెయ్యాలా అనేది ఓ డైలమో అయ్యితే పవన్ ని డైరక్ట్ చేసే డైరక్టర్ దొరకటం కూడా పెద్ద టాస్క్ గా మారిందిట. హరీష్ శంకర్ కానీ సురేందర్ రెడ్డిని కానీ సీన్ లోకి తెద్దామంటే వాళ్లిద్దరూ ఆల్రెడీ పవన్ తో సినిమా కమిటయ్యి ఉన్నారు. ఇంక మరో మార్గం..గోపాల గోపాల డైరక్టర్ డాలీని సీన్ లోకి తేవటమే. లేదా తన క్యాంప్ లో ఉన్న డైరక్టర్ ని పవన్ దగ్గరకు పంపి ఒప్పించటం. ఏం చేద్దామా అని దిల్ రాజు తన టీమ్ తో డిస్కషన్స్ చేస్తున్నారట. అయితే 2022 చివర్లో కానీ 2023 మొదట్లో కానీ ప్రాజెక్టు మొదలవుతుందిట. అప్పటిలోగా దిల్ రాజు ఎవరో ఒకరిని ఫైనలైజ్ చేసేస్తారనటంలో సందేహం లేదు.

## వకీల్ సాబ్ ఓటీటీ స్ట్రీమింగ్ కు డేట్ ఫిక్స్

పవన్ కళ్యాణ్ రీ ఎంట్రీ మూవీ వకీల్ సాబ్ ఓటీటీ స్ట్రీమింగ్ గురించి ఇటీవల మీడియాలో పుకార్లు షికార్లు చేసిన విషయం తెల్సిందే. సినిమా థియేటర్ లో విడుదల అయిన వారం రోజుల్లోనే ఓటీటీలో స్ట్రీమింగ్ అవ్వబోతుంది అంటూ వార్తలు వచ్చాయి. ఆ వార్తలను నిర్మాత దిల్ రాజు కొట్టి పారేశారు. వకీల్ సాబ్ ఓటీటీలో విడుదల చేసేందుకు చాలా సమయం ఉంది. ఇప్పట్లో రాదు కనుక థియేటర్ లోనే వకీల్ సాబ్ ను చూసి ఎంజాయ్ చేయండి అంటూ ఒక పోస్టర్ నే విడుదల చేయడం జరిగింది. కరోనా సెకండ్ వేవ్ కారణంగా థియేటర్ల పరిస్థితి దారుణంగా ఉంది. వకీల్ సాబ్ థియేటర్లు అన్ని కూడా బోసి పోయి కనిపిస్తున్నాయి. దాంతో ఈ సినిమా ను ఓటీటీ లో విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. టాలీవుడ్ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం అమెజాన్ ప్రైమ్ వారు వకీల్ సాబ్ సినిమా ను స్ట్రీమింగ్ కోసం కొనుగోలు చేయడం జరిగిందట. మే 7వ తారీకున ఈ సినిమాను స్ట్రీమింగ్ కు సిద్దం చేస్తున్నారు. వకీల్ సాబ్ విడుదల అయిన నెల రోజుల తర్వాత స్ట్రీమింగ్ కు అమెజాన్ కు అనుమతి దక్కింది. థియేటర్లలో ఇంకా కూడా సినిమా ఆడుతున్న నేపథ్యంలో మరో రెండు వారాలు ఆగిన తర్వాత అమెజాన్ లో వకీల్ సాబ్ ను స్ట్రీమింగ్ చేయాలని బయ్యర్లు ఒత్తిడి చేస్తున్నట్లుగా తెలుస్తోంది. మే 7వ తారీకున లేదా అంతకు ముందే ఈ సినిమా స్ట్రీమింగ్ కు అమెజాన్ ప్లాన్ చేస్తోంది. బాలీవుడ్ సూపర్ హిట్ మూవీ పింక్ కు రీమేక్ గా రూపొందిన వకీల్ సాబ్ కు కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా జత కలవడంతో ప్రేక్షకులు సినిమాను కమర్షియల్ గా సక్సెస్ చేశారు. వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ సినిమా కరోనా కారణంగా కనీసం పాతిక కోట్లను కోల్పోయినట్లుగా టాక్ వినిపిస్తుంది. మొత్తానికి పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ వంటి కమర్షియల్ సక్సెస్ తో రీ ఎంట్రీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అభిమానులు అంటున్నారు. థియేటర్లలో చూడలేక పోయిన పవన్ అభిమానులు మరియు ఫ్యామిలీ ప్రేక్షకులు వకీల్ సాబ్ ను ఓటీటీలో చూడటం కోసం ఎదురు చూస్తున్నారు. కనుక త్వరగా స్ట్రీమింగ్ చేసేందుకు అమెజాన్ ఉవ్విల్లూరుతున్నట్లుగా తెలుస్తోంది.

## పవన్.. హరీష్ శంకర్ మూవీ ఇంట్రెస్టింగ్ అప్ డేట్

పవన్ కళ్యాణ్ బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో బిజీ బిజీగా ఉన్నాడు. వకీల్ సాబ్ తో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ మరో వైపు సాగర్ చంద్ర దర్శకత్వంలో మలయాళ సూపర్ హిట్ మూవీ అయ్యప్పనుమ్ కోషియుమ్ లో రానాతో కలిసి నటిస్తున్నాడు. అలాగే క్రిష్ దర్శకత్వంలో హరి




హర వీరమల్లు సినిమాను కూడా చేస్తున్నాడు. కరోనా కారణంగా కాస్త ఆలస్యం అవుతున్న ఈ రెండు సినిమాలు సెట్స్ పై ఉండగానే హరీష్ శంకర్ దర్శకత్వంలో సినిమాను కూడా పవన్ సెట్స్ పైకి తీసుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయంటున్నారు. పవన్ కళ్యాణ్.. హరీష్ శంకర్ ల కాంబోలో వచ్చిన గబ్బర్ సింగ్ సెన్సేషన్ సక్సెస్ గా నిలిచిన విషయం తెల్సిందే. ఆ సినిమా తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబో సెట్ అయ్యింది. ఈ సినిమా గురించి ఒక ఆసక్తికర వార్త ఒకటి సినీ వర్గాల్లో మరియు మీడియా సర్కిల్ లో చర్చనీయాంశంగా మారింది. గబ్బర్ సింగ్ తో పాటు పవన్ కళ్యాణ్ అంతకు ముందు నటించిన పలు సినిమాల్లో అలీ ముఖ్య పాత్రల్లో కనిపించాడు. కాని ఈమద్య కాలంలో పవన్ సినిమాల్లో ఆయన కనిపించడం లేదు. వకీల్ సాబ్ సినిమా లో అలీ పాత్రకు స్కోప్ లేకపోవడంతో ఆయన్ను నటింపజేయలేదు. అయ్యప్పనుమ్ రీమేక్ మరియు హరిహర వీరమల్లు సినిమాల కథలు కూడా అలీ పాత్రకు స్కోప్ లేకపోవడంతో పవన్.. అలీ ల కాంబోను చూసే అవకాశం లేదు. కాని హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో మాత్రం అలీ కి ఫుల్ లెంగ్త్ పాత్రను ఇచ్చినట్లుగా తెలుస్తోంది. గబ్బర్ సింగ్ సినిమాలో ఎలా అయితే పవన్ తో ట్రావెల్ అయ్యే పాత్ర చేశాడో ఈ సినిమాలో కూడా అలాంటి పాత్రను హరీష్ శంకర్ రాసినట్లుగా తెలుస్తోంది. అలీతో నటించడంను ఎంజాయ్ చేస్తానంటూ గతంలో పలు ఇంటర్వ్యూల్లో పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చాడు. మద్యలో కొన్ని కారణాల వల్ల గ్యాప్ వచ్చింది. పైగా అలీ జనసేనలో కాకుండా వైకాపాలో జాయిన్ అవ్వడం వల్ల కూడా ఇద్దరి మద్య గ్యాప్ వచ్చిందని వార్తలు వచ్చాయి. కాని రాజకీయాలతో సంబంధం లేకుండా అలీ ఇంట వేడుకలో పవన్ ఇటీవల హాజరు అయ్యి మా మద్య ఎలాంటి విభేదాలు లేవు అంటూ చెప్పకనే చెప్పాడు. దాంతో హరీష్ శంకర్ మూవీలో పవన్ తో అలీ మళ్లీ సందడి చేయడం ఖాయం అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,

మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989